

# దేవీ.. నమోస్తుతే..

● నేటి నుంచి దసరా ఉత్సవాలు ● విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్న ఆలయాలు



మదనపల్లెలోని కోర్టులో గంగమ్మ


వాల్మీకిపురం నలవీరగంగాభవానీ అమ్మవారు


రాజంపేట కన్యకాపరమేశ్వరి అమ్మవారు


పీలేరులోని రౌద్రాల అంకాలమ్మ ఆలయం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయాలు విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆలయాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దసరా పండుగ ఉత్సవాల్లో భాగంగా దేవీ శరన్నవ రాత్రి అలంకార ఉత్సవాలు ఈనెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ గురువారం వరకు 11 రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో ఈనెల 22వ తేదీ అక్టోబరు నెల 2వ తేదీ వరకు దసరా నవరాత్రులు అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. ఈ నవరాత్రుల్లో భాగంగా శ్రీభద్రకాళీ అమ్మవారు ప్రతిరోజు వివిధ అలంకారాల్లో భక్తులు దర్శనమివ్వనున్నారు. అలాగే అక్టోబరు 2వ తేదీ గురువారం విజయదశమి సందర్భంగా సాయంత్రం 5 గంటలకు శమీ పూజా తదనంతరం రాయచోటి పట్టణ పురవీధుల్లో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. దసరా నవరాత్రులకు భక్తాదులందరూ పాల్గొని స్వామి, అమ్మవారి కృపా కటాక్షములకు పాత్రులు కాగలరని ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ రమణారెడ్డి తెలియజేశారు. అలాగే రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీ చెక్‌పోస్టు శివాలయం, పాత రాయచోటిలోని ప్రాచీన ద్రాక్షాయణి సమేత అగస్తేశ్వరాలయం, కొత్తపేట రామాపురంలోని చౌడేశ్వరిదేవి ఆలయం, ఎన్జీవో కాలనీలోని లక్ష్మిగణపతి ఆలయం, చెన్నముక్కపల్లి సమీపంలోని శ్రీకాశీవిశ్వేశ్వర విశాలాక్షి ఆలయం, పాతరాయచోటికి సమీపంలోని తోపు గంగమ్మ ఆలయం, గాంధీబజారులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు 11 రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మదనపల్లె పట్టణంలో పలు ఆలయాలను విజయదశమికి ముస్తాబు చేశారు. నవరాత్రుల ఉత్సవాల్లో కోర్టు ఆవరణంలో వెలసిన కోర్టులో గంగమ్మ ఆలయం, వాసవీభవన్ వీధిలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం, నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయం, మదనపల్లె మండలం, కొండామరిపల్లె గ్రామం, దేవతానగర్‌లోని రాజరాజేశ్వరీదేవి ఆలయం, దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయం విద్యుత్ అలంకరణలు చేసి దసరాకు ముస్తాబు చేశారు. అలాగే రాజంపేట, పీలేరు, రైల్వేకోడూరు, వాల్మీకిపురం, కలికిరితో పాటు మిగిలిన ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలన్నీ దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.


వాల్మీకిపురం నలవీరగంగాభవానీ ఆలయం


విద్యుత్ దీపాలంకరణలో
రాయచోటి వీరభద్రస్వామి ఆలయం


నందలూరు అమ్మవారి ఆలయం


మదనపల్లెలోని రాజరాజేశ్వరీ ఆలయం


విద్యుద్దీపకాంతుల్లో పీలేరులోని ఆలయం


రాయచోటిలో...

## సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలు చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

**నేటి నుంచి దసరా ఉత్సవాలు..**

రెడ్డెమ్మకొండ ఆలయంలో అమ్మవారి దసరా ఉత్సవాలను సోమవారం నుంచి 11 రోజులు వైభవంగా నిర్వహించనున్నారు. 22వ తేదీ అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న పార్వతిదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న లలిత త్రిపురసుందరీదేవి, 28న మహాచండీ అలంకారం, 29న సరస్వతిదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసుర మర్ధినీ, 2న రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని ఈవో మంజుల కోరారు.

## 2600 మెట్రిక్ టన్నుల యూరియా రాక

● పరిశీలించిన వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్

కడపరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయ అవసరాలకు గానూ ఆదివారం కడప రైల్వేస్టేషన్‌కు రేక్ ద్వారా కడప, అన్నమయ్య జిల్లాలకు 2600 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. డీఏవోలు, కంపెనీ ప్రతినిధులు రేక్ అధికారులతో సంప్రదించి కేటాయించిన పరిణామాలను ఆయా జిల్లాలకు సరఫరా చేశారు. ఇందులో వైఎస్ఆర్ కడప జిల్లాకు 2080 మెట్రిక్ టన్నులు రాగా వాటిలో 780 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు, 1300 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు తరలించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 520 మెట్రిక్ టన్నులు రాగా వీటిని మార్క్‌ఫెడ్‌కు పంపిణీ చేశారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక


● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## గండికోటలో 26.6 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.6 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయర్ నుంచి వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1100క్యూసెక్కులు ఉందన్నారు. వాగులు, వంకలు, పెన్నా, చిత్రావతి నదుల ద్వారా 100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని తెలిపారు. గండికోట నుంచి సీబీఆర్‌కు వెయ్యి క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు ఉందని తెలిపారు.


గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ములకలచెరువు పెద్దచెరువు మొరవతో నీట మునిగిన మొక్కజొన్న పంట



# పంటల మునక

● మొరవపోతున్న ములకలచెరువు పెద్దచెరువు

● నీట మునిగిన టమోట, మొక్కజొన్న, వంకాయ, బెండకాయ తోటలు

ములకలచెరువు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు పెద్దచెరువు నిండి మొరవపోతుండడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. రెండు రోజుల క్రితం కురిసిన కుండపోత వర్షానికి ములకలచెరువు పెద్ద చెరువు రాత్రికి రాత్రే నిండిపోయి మొరవపోతోంది. చెరువులోకి వచ్చే వాగులు, వంకల్లో నీరు పొంగిపొర్లుతుండంతో నీరు భారీగా చేరుతోంది. దీంతో ఆదివారం నుంచి మొరవ ఉధృతి పెరిగింది. మొరవనీరు పాత ములకలచెరువుకు చెందిన పాలగిరి గోపికి చెందిన మూడు ఎకరాలలోకి రావడంతో మొక్కజొన్న పంట పూర్తిగా నీట మునిగింది. అలాగే బురుజుపల్లెకు సమీపంలో ఉన్న హనుమంతురెడ్డి, వెంకటరెడ్డిలకు చెందిన ఐదు ఎకరాల టమోటా పంట పూర్తిగా నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే కోనేటివారిపల్లె పంచాయతీ బిక్కారివారిపల్లె వద్ద గూడుపల్లెకు వెళ్ళే వంక తెగిపోయి సమీపంలో ఉన్న పంటలలోకి రావడంతో రైతు రాజుకు చెందిన ఆరు ఎకరాల వంకాయ, బెండకాయ, మొక్కజొన్న పంట పూర్తిగా నీట మునిగింది. పంటలు నీట మునిగినా వ్యవసాయశాఖ అధికారులు మాత్రం పత్తాలేరని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా నీట మునిగిన తమ పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**కుంగిన 40 చెక్‌డ్యాం**

మండలంలోని వేపూరికోట పంచాయతీ ఎద్దులవారిపల్లె సమీపంలో చిన్నేరులో 40 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన మునలి మడుగు చెక్‌డ్యాం మొరవ కుంగిపోయింది. మద్దినాయనిపల్లె చెరువు నుంచి చిన్నేరు మీదుగా తిరుమలదేవరచెరువుకు నీరు వెళ్లే చెక్‌డ్యాం భారీగా మొరవపోయి ఆదివారం కుంగిపోయిందని గ్రామస్థులు తెలిపారు. ఈ చెక్‌డ్యాం వల్ల చుట్టుపక్కల గ్రామాల్లోని వంద బోర్లు రీచార్జ్ అవుతాయని, గొర్రెలు, పశువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. చెక్‌డ్యాం మొరవ మరింతగా కుంగిపోకముందే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


బురుజుపల్లె సమీపంలో నీట మునిగిన టమోటా పంట

# ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్య

● మృతదేహాన్ని కుందూనదిలో వేసిన కిడ్నాపర్లు ● ఆర్థిక లావాదేవీలే కారణంగా భావిస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో సంచలనంగా మారిన ఫైనాన్స్ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి కిడ్నాప్ వ్యవహారం విషాదకరంగా ముగిసింది. శుక్రవారం రాత్రి బొల్లవరం మున్సిపల్ లేఅవుట్ దగ్గర కిడ్నాప్‌కు గురైన ఆయన కిడ్నాపర్ల చేతిలో హత్య గావింపబడ్డాడు. కిడ్నాపర్‌లను పట్టుకునే వేటలో రూరల్ పోలీసులు కొందరు అనుమానితుల్ని హైదరాబాదులో అదుపులోకి తీసుకోవడంతో హత్య ఉదంతం వెలుగులోకి వచ్చింది. వారిచ్చిన సమాచారం మేరకు..

ఆదివారం సాయంత్రం చాపాడు వద్ద కుందూనదిలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది పవర్ బోట్‌లలో గాలింపు చర్యలు చేపట్టడంతో వేణుగోపాల్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు పోలీసులు అంబులెన్సులో ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. నీళ్లలో బాగా ఉబ్బిపోయి వున్న మృతదేహాన్ని చూసి భార్య, కుమార్తె, కుటుంబసభ్యులు బోరున విలపించారు. కిడ్నాప్ చేసిన వారు శుక్రవారం రాత్రే వేణుగోపాల్‌రెడ్డిని హత్య చేసి కుందూనదిలో వేసినట్లు విచారణలో వెల్లడించినట్లు చెబుతున్నారు. ఈ హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. హత్యగావింపబడిన వ్యక్తి అనేక మందికి వడ్డీలకు అప్పులు ఇచ్చారని, వారు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో వారి బాండ్లు కోర్టులో వేసినట్లు చెబుతున్నారు. ఆ కేసులు తుది దశకు రావడంతో అప్పులు తీసుకున్న వారే ఈ కిడ్నాప్‌కు పాల్పడి వేణుగోపాల్ రెడ్డిని హత్య చేశారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రొద్దుటూరులో ఈ తరహా కిడ్నాప్ వ్యాపార వర్గాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. కిడ్నాప్ కేసును రూరల్ పోలీసులు కొన్ని గంటల్లోనే ఛేదించి మృతదేహాన్ని కనుగొన్నారు. కాగా నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.


కిడ్నాప్‌నకు గురై మృతి చెందిన వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

# చెరువు కబ్జా

● ఎక్స్‌కవేటర్‌తో చదును ● అడ్డుకున్న రైతులు


వాల్మీకిపురం మండలం గంగాదొడ్డి సమీపంలో ఎక్స్‌కవేటర్‌తో చదును చేసిన చిన్ననారాయణ కుంట చెరువు ప్రాంతం

వాల్మీకిపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏకంగా చెరువునే కబ్జా చేసే ప్రయత్నాలు సాగించిన సంఘటన వాల్మీకిపురం మండలంలో ఆదివారం ఉదయం జరిగింది. మండలంలోని కూరపర్తి గ్రామ పంచాయతీ గంగాదొడ్డి గ్రామ సమీపాన ఉన్న చిన్ననారాయణకుంట (కొత్తకుంట) చెరువు సర్వే నెంబరు 418/1లో 8.94 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కూరపర్తి, గంగాదొడ్డి గ్రామాలకు వ్యవసాయ సాగు, బోర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ చెరువు ప్రాంతాన్ని పలువురు వైసీపీకి చెందిన నాయకులు వ్యవసాయ పొలాలకు దారి కోసం అని చెబుతూ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఆదివారం ఉదయం ఎక్స్‌కవేటర్ పెట్టి చెరువు ప్రాంతాన్ని కబ్జా చేసేందుకు చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. సుమారు మూడెకరాలు చెరువు ప్రాంతం అన్యాక్రాంతం దిశగా అక్రమాలకు పాల్పడుతున్నారని దీనిపై మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ పామిలేటిని వివరణ కోరగా పరిశీలించి తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గంగాదొడ్డి ప్రాంతం పూర్తి హద్దులు గుర్తిస్తూ గ్రామస్తులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.


చెరువు కబ్జాపై ఫిర్యాదు చేస్తున్న రైతులు

## టీఎన్‌ఎస్‌ఎఫ్‌ను బలోపేతం చేయాలి



పల్లా శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న రేవూరి వేణుగోపాల్

నందలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీ పార్టీ జాతీయ కార్యాలయంలో ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ రేవూరి వేణుగోపాల్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ కమిటీలు, టీఎన్‌ఎస్‌ఎఫ్ బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో నూతన ఉత్తేజం వచ్చిందని, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జిగా చమర్తి జగన్ మోహన్ రాజును నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## 'టీడీపీ అధ్యక్షుడుగా అర్హులకు అవకాశం కల్పించండి'

రాయచోటి టౌన్, సెప్టెం బరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడుగా అర్హులకు అవకాశం కల్పించాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కటారు శివ ప్రసాద్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. ఆదివారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా టీడీపీని బలోపేతం చేయడానికి అర్హులైన నాయకుడిని ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పరిస్థితులు పరిశీలించి నాలు గు దశాబ్దాలుగా టీడీపీకి సేవలందిస్తూ వస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబుకు జిల్లా టీడీపీ పగ్గాలు అందిస్తే, పార్టీ బలోపేతంతో పాటు బడుగు, బల హీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. రాజంపేట పార్లమెంట్ సభ్యులుగా, రాయచోటి ఎమ్మెల్యేగా దశాబ్దాల కాలం తెలుగుదేశం పార్టీకి సుగవాసి కుటుంబం సేవలందించిందని గుర్తు చేశారు. సుగవాసి ప్రసాద్‌బాబుకు పార్టీ బాధ్యతలు ఇవ్వడం ద్వారా జిల్లాలో మరో నాలుగు దశాబ్దాలు పార్టీకి ఎదురుండదన్నారు. అంతేగాక సామాజిక, రాజకీయ కోణాలతో పార్టీ నడిచిన నేపథ్యం పరిశీలించి సరైన నాయకత్వాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

## శైవక్షేత్రంలో సామూహిక పిండ ప్రదానం



పితృదేవతలకు పూజలు చేస్తున్న స్థానికులు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైకోట గ్రామ పంచాయతీలోని రామాలమ్మ కాలువ వద్ద ఉన్న శైవ క్షేతంలో జూటూరు నరసింహ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం సామూ హిక పిండప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజుతో పాటు పలువురు నాయకులు, ప్రజలు పాలొన్నారు.

## నాగారపమ్మకు పూజలు

సుండుపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈడిగపల్లె సమీపంలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు.అమ్మవారికి బోనాలు సమర్పించి, ఆలయ సమీపంలోని మామిడి తోటల్లో అన్నదానం చేశారు.

## 12 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నముక్కపల్లి గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 12 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 28 మంది కి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రాజంపేట: కన్యకా పరమేశ్వరి ఆలయ మార్గంలో ఆర్చి



నందలూరులో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

రాజంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాలకు మూడు నియోజకవర్గాల్లో ఉన్న అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. రాజంపేట పట్టణంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ముఖద్వారం సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వాసవీ మాత, వినాయకుని ప్రతిమలతో ఏర్పాటు చేసిన విద్యుత్ కటౌట్‌లను అత్యంత వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయం ప్రాంగణం అంతా అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంది. కాగా, సోమవారం దీక్షా బంధన అలంకారం, 23న బిల్వవృక్ష నివాసిని 24న అన్నపూర్ణ, 25న శ్రీకృష్ణమూర్తి, 26న మోహిని అలంకారం, తోట ఉత్సవం నిర్వహిస్తామన్నారు. 27న మీనాక్షి, 28న గాయత్రి, 29న సరస్వతి 30న మహిషాసురమర్దిని, అక్టోబరు 1న మహాలక్ష్మి, 2న రాజరాజేశ్వరి అలంకారాల్లో అమ్మవారు దర్శనం ఇస్తారని అదే రోజు రాత్రి పారువేట ఉత్సవం ఉంటుందన్నారు. 3వ తేదీ ఊంజలసేవతో శరన్నవరాత్రులు ముగుస్తాయని పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణగుప్త, ఉపాధ్యక్షులు దోర్నాల వెంకటేశం, సనిశెట్టి రమేష్‌బాబు, కార్యదర్శి పత్తి నాగరాజు తెలిపారు.

**నందలూరు:** నాగిరెడ్డిపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీవ వరకు ప్రతిరోజు ఒక్కో అలంకారంలో కన్యకాపరమేశ్వరిదేవి దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు అలంకరణలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు మాకం వెంకట్‌కుమార్, కార్యదర్శి సురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శి ఎంబలూరు నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**లక్కిరెడ్డిపల్లె:** మండల కేంద్రంలోని విశ్వభారతి పాఠశాల సమీపంలోని సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఓబులేశ్వరమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త గొర్ల భూదేవమ్మ, గొర్ల మోహన్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరిస్వామి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 22వ తేదీ బాలాత్రిపుర సుందరి, 23న గాయత్రి, 24న అన్నపూర్ణ, 25న గౌరి, 26న మహాలక్ష్మి , 27న లలితాంబిక, 28న సంతానలక్ష్మి, 29న సరస్వతి , 30న శ్రీదుర్గ, 1న మహిషాసురమర్దిని, 2న రాజరాజేశ్వరి దేవి అలంకారంలో సర్వమంగళాదేవి అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. అమ్మవారికి ఉభయం సమర్పించదలచిన భక్తులు 9502639099, 9502134940, 9347855966లకు సంప్రదించి మీ అమూల్యమైన పేరును నమోదు చేసుకోగలరని కమిటీ సభ్యులు

శ్రీసర్వమంగళాదేవి అమ్మవారు

**రామాపురం:** మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామ శ్రీసాయినగర్‌లోని సద్గురు దర్గా స్వామీజీ, దర్గా మాతాజీల శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా మాతాజీ ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. 22వ తేదీన దర్గా మాతాజీ రాజరాజేశ్వరి దేవిగా, 23న భవాని, 24న శారద , 25న అన్నపూర్ణ, 26న బిల్వవృక్ష నివాసిని పార్వతి, 27న గజలక్ష్మి , 28న బాలత్రిపుర సుందరి 29న సరస్వతి , 30న మహిషాసుమర్దిని , అక్టోబరు 1న గాయత్రి, 2న విజయ లక్ష్మి అలంకారంలో దర్శనం ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**రైల్వేకోడూరు రూరల్ :** కోడూరు పట్టణంలోని దసరా ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గునిశెట్టి రమేష్ తెలిపారు. ప్రతిరోజు ఆలయంలో పంచామృతాభిషేకాలు, మహా నైవేద్యం, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

**రాయచోటి, నేతాజీ సర్కిల్:** పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలోశరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు శివగంగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. 22వ తేదీ నుంచి అక్టోబరు 3 వరకు దసరా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. పూజల్లో పాల్గొను వారు రూ.500 కట్టి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలియజేశారు. విజయదశమి రోజు గ్రామోత్సవం ఉంటుందన్నారు.

# సేవా పక్షోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు



రక్తదాన శిబిరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ కుమార్

రాజంపేట టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం, సేవా పక్షోత్సవాల్లో భాగంగా అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం నిర్వహించారు. రాష్ట్ర దళిత మోర్చా కార్యదర్శి మృగరాజు రమణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిలోకేశ్ మాట్లాడుతూ 35 మంది బీజేపీ కార్యకర్తలు రక్తదానం చేశారన్నారు. సేవా పక్షోత్సవాల కన్వీనర్ ఆదినారాయణ, మైనార్టీ రాష్ట్ర నాయకులు షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయాదవ్, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

**పుల్లంపేట :** సేవా సప్తహంలో భాగంగా హుతాత్మ దివస్‌ను పురస్కరించుకొని ఆదివారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 36 మంది రక్తదానం చేశా. విశ్వహిందూ పరిషత్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గోపాల ప్రభాకర్, జిల్లా విశేష సంస్కర్త నరసింహకుమార్, మండల బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నరేంద్ర, రిటైర్డ్ లెక్చరర్ సాదు సుబ్బరాయుడు, మునక్కాయల పెంచల్‌రెడ్డిల సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చొప్పా ట్రావెల్స్ అధినేత రాజారెడ్డి రక్తదాతలకు పండ్లు, జ్యూస్, అల్పాహారం అందించారు.

# 8 గంటల పని దినం కోసం పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉదయ్‌కిరణ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 8 గంటల పని దినాల సాధనకు కార్మి కులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ (ఎంఎల్) లిబ రేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉదయ్‌కిరణ్ పిలుపు నిచ్చా రు. ఆదివారం రాయచోటి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా కమిటీ సమావేశం జరిగింది. అంతకుముందు స్థానిక బస్టాండు సర్కిల్ వద్ద సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 98 గంటల పని దినాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల వివక్ష చూపడం తగదన్నారు. కూటమి ప్రభుత్వానికి కార్పొరేట్‌ల లాభాలు తప్ప కార్మికుల సంక్షేమం పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేద ని, అందుకే పనిగంటలు పెంచుతూ తీర్మానాలు చేయడం మంచిది కాదన్నారు. 8 గంటల పనిదినాల కోసం కార్మికు లు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్, జిల్లా కమిటీ సభ్యు లు సిగి చెన్నయ్య, రమణ, వెంకటేశ్, రఘునాథనాయుడు, సుబ్బయ్య, మహిళా సంఘం నాయకురాలు ఎం. సుజాత, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి తుమ్మల లవకుమార్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో త్రివేణి కార్మిక సంఘం నాయకులు వరప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వమే మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను ప్రైవేటు ధారాదత్తం చేయడం తగదన్నారు. నిర్మాణాలు పూర్తయితే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు సమీప ప్రాంతాలలో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్మికుల పని గంటల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఆందోళన లు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, త్రివేణి కార్మిక సంఘం కార్యదర్శి వెంకటరమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, పాండురంగయ్య, నరసింహులు, కృష్ణయ్య, భాస్కర్, హరి, శ్రీను తరితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబుతోనే ముస్లింల సంక్షేమం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా



పాతరాయచోటి దర్గా వద్ద మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటి టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడు తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన పాతరాయచోటి దర్గా వద్ద విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పును ముస్లింలందరూ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. వక్ఫ్ చట్టం సవరణలపై ముస్లింలు ఆందోళనకు గురయ్యారన్నారు. అయితే, ముస్లింల మనోభావాలను జేపీసీ దృష్టికి వెళ్లేలా చంద్రబాబు కృషి చేశారన్నారు. అప్పుడు అసమంజస సవరణలను తొలగించగా, నేడు సుప్రీంకోర్టు మిగిలిన అసమంజస సవరణలపై స్టే విధించిందన్నారు. వక్ఫ్ చట్ట సవరణలు అమలుపై సుప్రీం కోర్టు మధ్యంతర తీర్పును వెల్లడించి రాజ్యాంగ పరంగా కల్పించిన హక్కులను కాపాడి తన ఔన్నత్యాన్ని చాటి చెప్పడంతో ప్రజల విశ్వాసాన్ని గెలిచిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మైనార్టీ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. గతంలో వైసీపీ మాయ మాటలతో ముస్లింలను అన్నిరకాలుగా మోసం చేసిందన్నారు. కొంత మంది వైసీపీ నాయకులు పదే పదే జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సుప్రీం కోర్టు తీర్పు వచ్చిందని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వైసీపీ నేతలు క్షుణ్ణంగా చదివి తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి

పెనగలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఐదుగురికి ఆదివారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ నాయకురాలు ముక్కా వర లక్ష్మి రూ.1,96,043 ముఖ్యమం త్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నారాయణనెల్లూరులో పలుకూరు జానకిరామ్‌కు 31,365 రూపాయలు, మొలకల శంకరమ్మకు 25,895, దేవిశెట్టి కృష్ణవేణికి రూ.25, 600, జడవారిపల్లెలో పసుపులేటి నరసింహులకు రూ.50,524, ముద్రపల్లె పంచాయతి పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన నిమ్మల శిరీషకు రూ62659 చెక్కులను నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీని వాసులరెడ్డి, కేఎస్ఆర్, డి.దామోదర్‌నాయుడు, కె.సుదర్శనచౌదరి, ఎల్. రెడ్డయ్యరెడ్డి, ఎస్.అమీరుల్లా, కె.కళాచంద్ర, తోట పిచ్చయ్య, సింగనమల సర్పంచి ఎర్రి శివ, డిష్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## 'సోమశిల ముంపు బాధితులను ఆదుకోవాలి'



దెబ్బతిన్న పంటలను చూపుతున్న సీపీఐ నాయకులు, రైతులు

పెనగలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్టు వెనుక జలాల కారణంగా నష్టపోతున్న నర్సింగరాజపురం హరిజనవాడకు చెందిన దళితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని మండల సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నర్సింగరాజపురం హరిజనవాడ లో దళిత రైతులకు చెందిన భూముల్లో నీళ్లలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వరి, రాగి, సజ్జ పంటలు బాగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేల రూపాయలు వంతున నష్టపరిహారం ఇచ్చి దళితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జి.ఆదినారాయణ, సహాయకార్యదర్శి ఈరి లక్ష్మీనారాయణ, డీహెచ్‌పీఎస్ కార్యదర్శి శివశంకర్, మండల కౌన్సిల్ సభ్యుడు ఆర్.శంకరయ్య, రైతులు శివకుమార్, వెంకటరమణ, అచ్చమ్మ, పెంచలమ్మ, ఈశ్వరయ్య దళితులు పాల్గొన్నారు.

## చెయ్యేటి వద్ద ఓబిలి గ్రామ పెద్దలు కాపలా..

పెనగలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సుండుపల్లె మండలంలోని పింఛా ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరదనీరు చెయ్యేరులో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఓబిలి - టంగుటూరు గ్రామాల మధ్య ఉన్న మట్టిరోడ్డు వరదనీటి ప్రవాహానికి కొంతదూరం కొట్టుకుపోయింది. దాంతో నందలూరు, పెనగలూరు మండలాల సరిహద్దు గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఓబిలి గ్రామ టీడీపీ ఇన్‌చార్జి ఎస్.అమీరుల్లా అధ్యక్షతన గ్రామ పెద్దలు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నీళ్లలో మనుషులు దిగకుండా కాపలా కాశారు. ఒకవేళ ఎవరైనా అటు ఇటు రావాలని ప్రయత్నాలు చేస్తే గట్టిగా మందలించి నీళ్లలో దిగకుండా చర్యలు చేపట్టారు. ఈ విషయంపై అమీరుల్లా మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు నీళ్లలో ఈత కొట్టాలని ఆసక్తిగా వస్తుంటారని, వారిని నిలువరించి కాపాడేందుకే గ్రామ పెద్దల సహకారంతో ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. ఏటిలో నీటి ప్రవాహం బాగా తగ్గేవరకు ఈ కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగిస్తామన్నారు.

## వీఆర్ఏల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



కమిటీ సభ్యులతో షేక్ బందగీ సాహెబ్

రాజంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఎన్జీవో హోంలో జరిగిన సదస్సులో అన్నమయ్యజిల్లా వీఆర్ఏ, సీఐటీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షుడుగా సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడుగా మోడి ప్రసాద్, కొరముట్ల సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తిరుపాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.నరసింహులును ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఈ మధుబాబు, కనుపర్తి మణి, ఎం.రామచంద్రయ్య, షేక్ ఖాదర్‌వల్లి, కె.రమణయ్య, బి.రత్నమ్మ, ఎస్. లావణ్య, సహాయ కార్యదర్శులుగా ఎన్.నరసింహులు, ఎం.కోటేశ్వరరావు, బి. హరీష్, ఎన్.నరసయ్య, కోశాధికారి లక్ష్మీకర్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా గురజాడ జయంతి



గురజాడకు నివాళులర్పిస్తున్న కాకర్ల రాముడు, గంగనపల్లి వెంకటరమణ

రాజంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ వెంకట అప్పారావు 163వ జయంతి వేడుకలను పట్టణంలోని జౌళీ బజారులో ఉన్న సరస్వతి విద్యా మందిరంలో తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి కార్యదర్శి కాకర్ల రాముడు, సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకట రమణ మాట్లాడుతూ గురజాడ వెంకట అప్పారావు మనందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవడం మనందరి కర్తవ్యమన్నారు. బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి సామాజిక సమస్యలను తన కలం ద్వారా చక్కటి రచనలతో ప్రజలకు తెలియజెప్పే సామాజిక మార్పు కోసం విశేషంగా కృషి చేసిన మహనీయుడు గురజాడ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్యానాయుడు, బీవీ నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'అన్నమాచార్య' లో విద్యుత్‌రంగంపై గెస్ట్ లెక్చర్

రాజంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో విద్యుత్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగంలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదివారం చెన్నై జనరల్ ఎలక్ట్రిక్ (జేఈ) సంస్థలో లీడ్ ఇంజనీర్ శివనాయక్ జారపాల గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పరిశ్రమలో ఆధునిక పరిణామాలు, పవర్ సిస్టమ్‌లో డిజిటలైజేషన్, మిషన్-క్రిటికల్ టెక్నాలజీ ప్రాధాన్యతను వివరించారు. విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ ఎన్.మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్‌కార్డులతో ప్రజల జీవితాల్లో మార్పులు



స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులతో ప్రజల జీవితాల్లో మార్పులు చోటు చేసు కుంటున్నాయని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్‌కార్డులతో అక్రమాలకు చెక్ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీలర్ గంగిరెడ్డి, శివారెడ్డి, జయరామరాజు, ఆదినారాయణరెడ్డి, చింతమాని శ్రీనివాసులు, డీలర్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

**● ముగ్గురి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ పోలీసులు**

కడప క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్లూకోల్ట్స్ పోలీసుల సమయస్ఫూర్తి, వేగవంతమైన స్పందన ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న ముగ్గురిని కాపాడింది. రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాలనుకున్న మహిళ, ఆమె ఇద్దరు పిల్లలను సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి అప్పగించి శభాష్ పోలీసు అని మన్ననలు పొందారు. వివరాలిలా.. ఎర్రముక్కపల్లె సమీపంలో ఉంటున్న ఓ మహిళ కుటుంబ కలహాలతో ఆదివారం ఉదయం 11గంటల సమయంలో తన ఇద్దరు పిల్లలను తీసుకుని భాకరాపేట రైల్వేగేటు వద్ద నుంచి రైల్వేటాక్‌పై వెళుతుండగా విధుల్లో ఉన్న ట్రాక్‌మన్ కిశోర్ వెంటనే గుర్తించి 112కు సమాచారం చేరవేశారు. సమీపంలో గస్తీలో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు రమా కాంత్‌రెడ్డి, వి.శ్రీనివాసులు వెంటనే స్పందించారు. ట్రాక్‌పై వేగంగా వెళుతున్న మహిళ, ఇద్దరు పిల్లలను సురక్షితంగా కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ చేసి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఈ విషయమై కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

## మోటరు బైకును ఢీకొన్న ఐచర్ వాహనం.. వ్యక్తి మృతి



షేక్ రసూల్ మృతదేహం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మోటారు సైకిలును ఐచర్ వాహనం ఢీకొనడంతో షేక్ రసూల్ (45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ బీఎన్ మూర్తి వివరాల మేరకు.. శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్ కాలనీకి చెందిన రసూల్ తన కుమార్తెను పిలుచుకు వచ్చేందుకు వెళుతుండగా ఐచర్ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో రసూల్ బైకు నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య ఫర్హానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కడప క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప - క్రిష్ణాపురం రైల్వే స్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తికి తెల్లని గడ్డం ఉందని, 42 నుంచి 45 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

## ఆటో బోల్తా... తప్పిన ప్రమాదం



కమలాపురం రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని క్రాస్ రోడ్డు ఆర్చి వద్ద ఆటో బోల్తాపడ్డ సంఘటన చోటు చేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం కడప నుంచి వస్తున్న ఆటో కమలాపురం ఆర్చి వద్ద గుంతల్లో బోల్తాపడింది. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. అయితే చాల రోజుల నుంచి రోడ్డు మరమ్మత్తులకు నోచుకోలేదు. క్రాస్ రోడ్డు నుంచి కమలాపురం వచ్చే దారిలో ఆర్చి వద్ద పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షాలు కురవడంతో నీరు నిలిచి గుంతలు కనిపించడంలేదు. దీంతో టూవీలర్లు, పాదచారులు గుంతల్లో పడి గాయపడుతున్నారు. ఎన్నిసార్లు ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికితీసుకెళ్లినా స్పందన లేదు. త్వరలో టెండర్లు పిలుస్తాం, ప్యాచింగ్ వేస్తాం అని చెబుతున్నారే తప్ప పని మాత్రం చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గతుకుల రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## లారీ, మినీ గూడ్స్ ఆటో ఢీ.. డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన ఆటో డ్రైవర్‌ను 108లో తరలిస్తున్న దృశ్యం

ముద్దనూరు సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని జమ్మలమడుగు బైపాస్ సమీపంలో ఆదివారం లారీ, మినీ గూడ్స్ ఆటో ఢీ కొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలు... ముద్దనూరు నాలుగు రోడ్ల వైపు నుంచి తాడిపత్రి వైపు పేయింట్ లోడుతో లారీ వెళుతుండగా.. జమ్మలమడుగు నుంచి బైపాస్ రోడ్డు వీదుగా తాడిపత్రి వైపు వస్తున్న మినీ గూడ్స్ ఆటో అదుపు తప్పి ఢీకొన్నాయి. దీంతో రెండు వాహనాల ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. జమ్మలమడుగు మండల కన్నెలూరుకు చెందిన మినీ గూడ్స్ ఆటో డ్రైవర్ రాజేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రెండు బైకులు ఢీ... ఒకరికి గాయాలు

పులివెందుల రూరల్, సెప్టెం బరు 21 (ఆంధ్రజ్యోతి): పులి వెందుల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రహీం అనే యువకుడికి రక్తగాయాల య్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రహీం పులివెందులలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని ట్రాఫిక్ సీఐ హాజీవల్లి పరిశీలించారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## బాలిక అదృశ్యం



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం శ్రీనివాసనగర్‌కు చెందిన మంగపట్నం వెంకట వాసవి (14) శనివారం రాత్రి ఇంటి నుంచి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని బాలిక తండ్రి శ్రీనివాసులు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎద్దుల వెంకటసుబ్బమ్మ హైస్కూలులో వాసవి 9వ తరగతి చదువుతోంది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలిక ఆచూకీ లభించిన వారు త్రీటౌన్ సీఐ, ఎస్ఐ సెల్ ఫోన్ నెంబర్లు 9121100589, 9121100592 ఫోన్ చేసి తెలపాలన్నారు.

## పుష్పగిరి రుద్రపాదం వద్ద సామూహిక పిండ ప్రదానం





కొండపై శివుని పాదంకు ప్రత్యేక అలంకరణ, పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తున్న దృశ్యం

వల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాలయ అవవాస్య సందర్భంగా ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి రుద్రపాదం వద్ద ఆదివారం సామూహిక పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పితృదేవతలతో పాటు మరణించిన తమ బంధువులకు పిండ ప్రదానం చేశారు. ముందుగా పంచమ నదిలో పుణ్యస్నానాలా చరించి రుద్రపాదం వద్ద పిండ ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ పిండ ప్రదానం చేస్తే పితృదేవతలు శాంతించి దీవిస్తారనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. పిండ ప్రదాన కార్యక్రమం అనంతరం రుద్ర పాదానికి తగిలించి ఆ పిండాలను పంచమనదిలో కలిపారు. ఆలయ ఆలయ ధర్మకర్త డి.వెంకటసుబ్బారెడ్డి, ఈవో శ్రీనివాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

## ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం



పీఈటీస్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 21, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని ఏపీ పీఈటీస్ ఎస్ఏపీఈ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడు బొగ్గేటి శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కె.విక్టర్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక నగర శివారు ప్రాంత కెమిస్ట్రీ భవన్‌లో జిల్లా పీఈటీస్ ఎస్ఏపీఈ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశానంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఎంపిక కార్యక్రమానికి పరిశీలకులుగా అసోసియేషన్ ప్రతినిధులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రవికుమార్, వీరాంజనేయులు హాజరయ్యారు. దాదాపు 200 మంది వ్యాయామ ఉపాధ్యాయ ఉపాధ్యాయునీయుల సమక్షంలో జిల్లా నూతన అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ట్రెజరర్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆ మేరకు ట్రెజరర్‌గా పి.శివకృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, మాజీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం, రైతు సంఘం నేతలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డిలు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు.భారీవర్షాల వలన ప్రొద్దుటూరు మండల పరిధిలో రాజుపాళెం, పర్లపాడు ప్రాంతాల్లో వరి, పత్తి, కంది, పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కొన్ని ప్రాంతాల్లోభూములు కోతకు గురయ్యాయని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు రబీ సీజన్‌కు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను 90 శాతం సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనావేసి రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, రామాంజనేయులురెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్.. సామగ్రి దగ్ధం

సీకేదిన్నె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాడిగొట్ల క్రిష్ణాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కావడంతో నాగూర్ భార్గవ్‌రెడ్డి ఇంటిలోని ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోయాయి. ఇంటిలోని వాషింగ్‌మిషన్, ఫ్రిజ్, బీరువాలోని బట్టలు, దాదాపు రూ.3 లక్షలు విలువచేసే సామాన్లు, సర్టిఫికెట్లు కాలిపోయాయన్నారు. సమాచారం అగ్నిమాపక సిబ్బందికి అందించడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పివేసినట్లు స్థానికులు తెలిపారు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో పాముల కలకలం

జమ్మలమడుగు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం పాము కలకలం రేపింది. ఆస్పత్రి ఆవరణలోని మేల్ వార్డు నుంచి ఫిమేల్‌వార్డు అక్కడి నుంచి గేటు వద్దకు చేరింది. అప్పటికే కిటికీలో నుంచి పాము వస్తోందని అక్కడున్న రోగులు భయంతో పరుగు తీశారు. దీంతో ఆస్పత్రిలోని కొందరు సిబ్బంది చుట్టుముట్టారు. వెంటనే కిటికీలో నుంచి గేటు వద్దకు వచ్చిన పామును కట్టెతో కొట్టి చంపారు. దీంతో ఆందోళన చెందిన రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

## కులం పేరుతో దూషించారంటూ కేసు

చెన్నూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె హరిజనవాడకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తిని అదే పంచాయతీలోని శివశంకర్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించి దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శివశంకర్ అనే వ్యక్తికి, శ్రీనివాసులు మధ్య గత మూడేళ్లుగా డబ్బు విషయమై వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీనివాసులు శనివారం రాత్రి వ్యక్తిగత పనిమీద ఉప్పరపల్లె నుంచి చెన్నూరుకు వస్తుండగా దారిలో శివశంకర్ అతన్ని ఆపి కులం పేరుతో దూషిస్తూ రాళ్లతో దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## 10 మంది జూదరుల అరెస్టు

దువ్వూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దభాకరాపురం పొలాల్లో జూదం ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వీరి వద్ద రూ.66,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆదివారం ఆళ్లగడ్డ, దువ్వూరు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు రహస్య ప్రదేశాల్లో జూదం ఆడుతున్నట్లు తెలిసి దాడి చేసి, జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అలాగే చింతకుంటలో బజ్జీల కొట్టు నిర్వాహకుడు బెల్టు మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 14 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## 'పదోన్నతులు కల్పించకపోతే ఉద్యమిస్తాం'

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతుల్లో అన్యాయానికి గురైన 1207 మంది భాషా పండితులకు పదోన్నతులు కల్పించకుంటే ఉద్యమం చేపడుతామని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో భాషా పండితుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో భాషోపాధ్యాయుల పదోన్నతుల సమయంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో 1207 మంది పండిట్లు పదోన్నతులు రాక అన్యాయానికి గురయ్యారని పేర్కొన్నారు. దీనిపై తాము ఆరు సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్నామని తెలిపారు. తమ పోరాటంపై స్పందించిన హైకోర్టు పండిట్లకు పదోన్నతులు కల్పించాలని తీర్పునిచ్చిందన్నారు. కోర్టు తీర్పు మేరకు పదోన్నతులు కల్పించాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోగా గంగాధర్, నరసయ్య, భాస్కర్, భాషా పండితులు పాల్గొన్నారు.

## రాచమల్లు సుద్దులు వినే వారెవ్వరు లేరు


**● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి**



చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే రాచమల్లు సుద్దులు వినే వారెవ్వరూ లేరని, వారి ఉడత బెది రింపులకు ఎవ్వరూ భయపడరని, ప్రజా సంబంధమైన కార్యకలా పాల్లో పాల్గొంటానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం సహా య నిధి చెక్కులను కొండారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాది పొలికల్ గవర్నెన్స్ అని మా సీఎం చంద్రబాబే చెప్పారన్నారు. ప్రజావసరాలు ఆలస్యం కాకూడదనే రూ.54 లక్షల చెక్కులు పంపిణీ చేస్తున్నానన్నారు. అధికారం ఉందని తాను చెడ్డ పనులు చేస్తే విమర్శించాలన్నారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేకు చేదోడు వాదోడుగా పని చేస్తానన్నారు. ఎవ్వరి బెదిరింపులకు భయపడనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ సుబ్బారెడ్డి, వాల్మీకిబోయ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, మాజీ కౌన్సిల్లర్ వద్ది బాలుడు, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదలపాలిట ముఖ్యమంత్రి సహాయనిధి వరమని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలో వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి సహాయనిధి అందడం సంతోషకరమన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని 21 మంది లబ్ధిదారులకు రూ.10,96,035 లకు సంబంధించి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పెద్దముడియం టీడీపీ మండల కన్వీనర్ చిన్నపసుపుల శ్రీనివాసులరెడ్డి, మోరగుడి చౌడం జొల్లుపాండు, లోటన్‌సాగారి ఫక్రుద్దీన్, వేపరాల రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ టాప్ 2 శాస్త్రవేత్తల జాబితాలో యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్లు







వైస్‌చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు శంకర్, వీరాంజనేయరెడ్డి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడపకు యోగి వేమన యూనివర్సిటీకి గర్వకారణంగా ఇద్దరు ప్రొఫెసర్లు ప్రపంచంలోని టాప్ 2శాతం శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. యూనివర్సిటీలోని మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.వి.శంకర్, మైక్రోబయాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎల్.వీరాంజనేయరెడ్డిలు 2025 ఎడిషన్‌లో చోటు పొందారు. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన ఈ డేటాలో యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు కూడా టాప్ 2శాతం శాస్త్రవేత్తలలో ఉన్నారు. ఈ విజయంపై యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌లు శాస్త్రవేత్తలను అభినందిస్తూ వారి కృషి యూనివర్సిటీకి మరింత గౌరవాన్ని తెచ్చిందని తెలిపారు.

## కడప జంతుశాస్త్ర అధ్యాపకుడు నాగేంద్రకుమార్‌కు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగేంద్రకుమార్


కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రేవా యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ వీరనాగేంద్రకుమార్ సమర్పించిన వివిధ రకాల క్యాన్సర్లకు చికిత్స చేయడంలో కర్క్యుమిన్, దాని నానో ఫార్ములేషన్ల సంభావ్యపాత్ర అనే పరిశోధక అంశానికి మొదటి బహుమతి లభించింది. ఈ అవార్డును యూనివర్సిటీ కేలటన్ మలేషియా మాజీ వైస్ చాన్స లర్ ప్రొఫెసర్ డాటో ఇబ్రహీం చె ఓమర్, ఫిలిప్పీన్స్ సాన్ బేడా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అలోయ్షియస్మా ఎ.మారనన్ అందజేశారు. సదస్సులో 9 దేశా లకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## డాక్టర మునికుమారి పరిశోధనకు పేటెంట్



సర్టిఫికెట్‌ను అందిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, సెప్టెం బరు 21 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వ విద్యా లయం జన్యుశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మునికుమారి, పరిశోధక విద్యార్థి షేక్ బాబుల్లాకు పేటెంట్ లభించింది. వీరు ప్రయోగాత్మకంగా మొక్కల ఎదుగుదలకు అవసరమైన సూక్ష్మ పోషక మిశ్రమాన్ని నానో కణాలు ఉపయోగించి కొత్త ఫార్ములా అభివృద్ధి చేసినందుకు ఇండియన్ పేటెంట్‌ను పొందారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, సహచర అధ్యాపకులు, స్కాలర్లు అభినందించారు.



# ఇంద్రకీలాద్రికి దసరా శోభ

**నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు**

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

## విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

### శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

## నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

# ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు వాయుగండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

## అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

## నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

## కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

## 27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

## తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

## తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

## విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్నానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాలిత మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ పనుల్లో నత్తే నయం

- ఒక్క భవనం కూడా పూర్తికాని వైనం
- నిర్మాణ పనుల్లో నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు
- కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా...



పునాదుల దశలోనే ఆగిపోయిన మహమ్మద్‌నగర్ అంగన్వాడీ భవనం, శెట్టిపల్లె-2 అంగన్వాడీ భవనం పునాదులపై పిచ్చిమొక్కలు

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్ (ఐసీడీఎస్) శాఖ సొంత భవన నిర్మాణాలకు 2022లో వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద మంజూరు చేశారు. అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఒక్కొక్క భవనానికి రూ.13.20 లక్షల నిధులను కేటాయించారు. ప్రస్తుతం ఈ భవనాలు నిర్మాణ పనులను పరిశీలిస్తే నత్తే నయం అన్న చందంగా మారాయి. ఇప్పటి వరకు ఒక్క భవనం కూడా పూర్తికాకపోవడమే విశేషం. వివిధ దశల్లో భవన నిర్మాణ పనులు ఆగిపోయి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో అంగన్వాడీ భవనాల నిర్మాణంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని అభియోగాలు రావడంతో ప్రస్తుత ప్రభుత్వంలో కూడా వాటి పనులు సాగడం లేదు. వీటి పర్యవేక్షణ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అప్పగించారు. వీరు సంబంధిత కాంట్రాక్టర్లతో కలిసి భవన నిర్మాణానికి సామాగ్రి పేరుతో పనులు చేపట్టకుండా నిధులు మార్చుకున్నట్లు బాహాటంగానే చెబుతున్నారు. సామాగ్రి తోలిన చోట సిమెంటు, కడ్డీలు, ఇటుకలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇవి నిరుపయోగంగానే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. చాలా చోట్ల అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో ప్రైవేటు గృహాల్లో నిర్వహిస్తున్నారు. సంబేపల్లె మండలంలో 17 అంగన్వాడీ భవనాలు నాడు-నేడు కింద మంజూరయ్యాయి. 2022 నుంచి ఇప్పటి వరకు ఒక్క భవనం కూడా నిర్మాణ పనులు పూర్తి చేయలేదు.

**మండలంలో మంజూరైన కేంద్రాలు ఇవే...**

2022లో వైసీపీ ప్రభుత్వం సంబేపల్లె మండలంలో అగ్రహారం, దేవళంపేట, బావులకాడపల్లి, ఎస్.సోమవరం, ఎగువనల్లగుట్టపల్లి, బట్టావాండ్లపల్లె, గుదియవాండ్లపల్లె, మహమ్మద్‌నగర్, డి.వడ్డెపల్లె, శెట్టిపల్లె-1, శెట్టిపల్లె-2, గాండ్లపల్లి, పెద్దబిడికి, అంకిరెడ్డిగారిపల్లె కేంద్రాలను మంజూరు చేశారు.

**వివిధ దశల్లో ఉన్న భవనాల నిర్మాణ పనులు**

బొగ్గులవారిపల్లె, గాండ్లపల్లె, ఎగువ నల్లగుట్టపల్లి, బట్టావాండ్లపల్లె భవనాలు మౌల్డింగ్ దశలో ఉన్నాయి. దొడ్డిసిద్దయ్యగారిపల్లె, శెట్టిపల్లె-2, శెట్టిపల్లె-1, గుదియవాండ్లపల్లె, బావులకాడపల్లి, అగ్రహారం, దేవళంపేట, ఎస్.సోమవరం, మహమ్మద్‌నగర్, పెద్దబిడికి కేంద్రాలు పునాది దశలోనే నిలిపేశారు. నిధులు లేక కొన్ని కేంద్రాలు సిమెంటు, కడ్డీలు లేక మరికొన్ని భవనాలు ఇలా చాలాచోట్ల పనులు జరగలేదు. నిరుపయోగంగా ఉన్నాయి. భవనాల నిర్మాణం కోసం కేటాయించిన సామాగ్రి పనులు జరగకపోవడంతో దుర్వినియోగం అవుతున్నట్లు స్థానికులు తెలిపారు. బావులకాడపల్లి, గుదియవాండ్లపల్లె, దేవళంపేట కేంద్రాల భవన నిర్మాణ పనులు తక్కువ చేసి బిల్లులు ఎక్కువ చెల్లించినట్టు ఫిర్యాదులు వచ్చాయి. దేవపట్ల-1 అంకిరెడ్డిగారిపల్లె అంగన్వాడీ భవనాలు కట్టకుండానే సామాగ్రి పేరుతో బిల్లులు చెల్లించినట్లు చెబుతున్నారు. మహమ్మద్‌నగర్‌లో భవనంపై 11 కేవీ విద్యుత్ వైర్లు వెళుతున్నాయి. పునాది దశ వరకు వేసి నిలిపేశారు. మండలంలో మోడల్ స్కూల్‌కు వచ్చిన నిధులను కూడా అంగన్వాడీ భవనాల నిర్మాణాల కోసం నిధులు తరలించారు. పనులు తక్కువ చేసి ఎక్కువ బిల్లులు పొంది పనులు చేయకుండా వదిలేయడంతో పిల్లలకు వినియోగంలోకి రాలేదు. ఒక యూనిట్‌కు రూ.30 వేలు చొప్పున పనులను అప్పగించారు. కేంద్రాల పనులకు సంబంధించి సీపీయం కింద ప్రతి కేంద్రానికి కిటికీలు, డోర్లు, సిమెంటు, రంగులు, ఎలక్ట్రికల్ వర్క్ సామాగ్రి ప్రభుత్వం నుంచి సరఫరా చేశారు. కొంతమంది కాంట్రాక్టర్లు పనులు తక్కువ చేసి ఎక్కువ బిల్లులు తీసుకుని పనులు చేయకుండా వదిలేయడంతో నిధులు దుర్వినియోగం చేస్తారని ఆరోపిస్తున్నారు.

**కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా**

అంగన్వాడీ భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయి సామాగ్రి దుర్వినియోగం అవుతుంది. కూటమి ప్రభుత్వం ఆగిన భవనాల నిర్మాణాలను పరిశీలించి పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉంది. నిధులు దుర్వినియోగమైన చోట విచారణ చేపట్టి చర్యలు తీసుకుని భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

- జయనారాయణరెడ్డి, శెట్టిపల్లె

**పనులే జరగడం లేదు**



అంగన్వాడీ కేంద్రాల భవనాల పనులు జరగడం లేదు. కొన్నిచోట్ల నిధులు లేవు. కొన్నిచోట్ల సామాగ్రి సరఫరా చేయలేదు. సిమెంటు ఉంటే కడ్డీలు ఉండవు, కడ్డీలు ఉంటే సిమెంటు ఉండదు. ఇలా చాలా చోట్ల ఇచ్చిన సామాగ్రి దుర్వినియోగం అవుతోంది. భవన నిర్మాణానికి కావాల్సిన సామాగ్రి సరఫరా చేసి పూర్తి చేయాలి.

-శ్రీనివాసులు, ఎంఈఓ, సంబేపల్లె

## జీఎస్‌టీ తగ్గింపు ప్రధాని దసరా కానుక

పీలేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గింపు ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు దసరా కానుక అందించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.చంద్రశేఖరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 99 శాతం వస్తువులపై కేవలం 5 శాతం జీఎస్‌టీ విధింపు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని ఆయన గుర్తు చేశారు. జీఎస్‌టీ తగ్గింపు, ఉద్యోగులకు ఏడాది రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ద్వారా ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దేశప్రజలు అమితంగా లాభపడతారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు.

## దాడిలో యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సర్టిఫికెట్లు ఇవ్వలేదని భార్యపై గొడవ పడుతున్న భర్తపై వరసకు అన్న దాడి చేసి కర్రతో కొట్టి గా యపర్చినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసులు కథనం మేరకు కొండామరిపల్లె గ్రామం, వెంకటప్ప కోట కాలనీ వాసి నాగరాజ కుమారు డు శరత్‌బాబుపై ఎనుములవారిపల్లెకు చెందిన డ్రైవర్ రాజు ఆదివారం కర్రతో దాడిచేసి గాయపర్చాడు. సర్టిఫికెట్ల విషయమై భార్య స్వాతి, భర్త శరత్‌బాబు ఘర్షణ పడ్డారు. తనకు అన్న వరస అయిన రాజుకు ఫోన్‌ద్వారా స్వాతి సమాచారం ఇవ్వడంతో వెంటనే ఇంటికి వచ్చి శరత్‌బాబుపై దాడి చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే గాయపడిన వ్యక్తిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంక టరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కలప రవాణాను అడ్డుకున్న అధికారులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో పట్టపగలే దర్జాగా కలప అక్రమ రవాణా చేస్తున్న వారిని ఎట్టకేలకు అటవీ అధికారులు అడ్డుకున్నా రు. అనుమతి లేకుండా కలప రవాణా శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథ నానికి ఎఫ్ఆర్‌ఓ ప్రసాదరావు స్పందించారు. ఆదివారం ఉదయం ప్రభుత్వాస్పత్రి వద్దకు ఇన్‌చార్జి డీఆర్‌ఓ శివకుమార్ వెళ్లి పరిశీలించగా, అక్కడ చెట్లకు నరికి ట్రాక్టర్‌కు లోడ్ చేస్తుండగా వెళ్లి అడ్డుకున్నారు. శంకర్‌రెడ్డి అనే వ్యక్తి ఒక ప్రజాప్రతినిధి పేరు చెప్పి ఆయన అనుమతి ఇచ్చారని డీఆర్‌ఓను నమ్మించడానికి ప్రయత్నించారు. దీనిపై డీఆర్‌ఓ ఆరా తీయగా ప్రజాప్రతినిధి ఎవరికీ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో కలప ట్రాక్టర్‌ను అటవీశాఖ కార్యాలయానికి తరలించి ఎఫ్ఆర్‌ఓ జయప్రసాదరావు ట్రాక్టర్‌కు రూ.8,500 జరిమానా విధించారు.

## చిత్తడిగా టమోటా మార్కెట్

కలకడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే కలకడ- గుర్రంకొండ మార్గంలోని టమోటా మార్కెట్ చిత్తడిగా మారుతోంది. మండీల ముందు ప్రాంతం ఎత్తు పల్లాలుగా ఉంది. కారణంగా వర్షాలకు చేరుతున్న నీరు పారుదల లేక ఒకచోట నిలిచి బురదమయంగా మారుతోంది. ఇక్కడి నుంచి వివిధ మార్కెట్‌లకు టామోటాలను రవాణా చేసేందుకు వచ్చే వాహనాల చక్రాలు బురదలో చిక్కుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో ఒక్కసారి రోడ్డుపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి రాక పోకలకు అటంకం కలుగుతున్నట్లు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



## చెలరేగిపోతున్న కేబుల్ వైర్ల దొంగలు...

- ఒక్కరోజే 400 మీటర్ల వైరు దొంగతనం

నిమ్మనపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేబుల్ వైర్ల దొంగలు రోజురోజుకూ చెలరేగిపోయి ఎక్కడ పడితే అక్కడ వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలిస్తు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఆదివారం నిమ్మనపల్లి పంచాయతిలోని ఊట్లవంక సమీపంలో వున్న వ్యవసాయ బోర్ల వద్ద 15మంది రైతులు ఏర్పాటు చేసిన 400వందల మీటర్ల కేబల్ వైర్లను దోచుకెళ్లారు. అలాగే వాల్మీకిపురం మండలంలోని దేవళంకురవపల్లెకు చెందిన శ్రీరా ములు, వెంకటరమణ, నాగరాజు, శ్రీనివాసులు అనే రైతుల వ్యవసాయ బోర్ల వద్ద 135మీటర్లు కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి అపహరించుకుపోయారు. అంతే కాకుండా గత 6నెలలగా తవళం, అగ్రహారం, ముష్టూరు, కొండయ్యగారిపల్లి, రాచవేటివారిపల్లి, సామకోటవారిపల్లి పంచాయతీల్లో దాదాపు 50మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు కత్తిరించుకు పోయారు.

అలాగే పంచాయతీలకు చెందిన తాగునీటి బోర్లను కూడా వదల లేదు, కొండయ్యగారిపల్లిలో ఏకంగా మోటారు ఎత్తుకెళ్లారు. అయితే దీనిపై సంబంధిత రైతులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అగ్రనేతల సహకారంతో పీలేరులో జనసేన అభివృద్ధి

పీలేరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అధిష్టానం అండదండలతో నియోజవర్గంలో తమ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పీలేరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బెజవాడ దినేశ్ పేర్కొన్నారు. విజయవాడలో జరుగుతున్న తమ పార్టీ అంతర్గత వర్క్‌షాపులో పీలేరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై నివేదించినట్లు ఆయన తెలిపారు. పార్టీ అగ్ర నేత, ఎంఎల్సీ నాగేంద్రబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంఎల్సీ పిడుగు హరిప్రసాద్ పీలేరు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి శాయశక్తులా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జనసేనకు జనసైనికులే ఆరో ప్రాణం అని, పార్టీ సిద్ధాంతాలను వారి ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా వారు మార్గనిర్దేశం చేశారని, వారి మార్గదర్శకత్వంలో పార్టీ నూతన జవసత్వాలు కూడగట్టుకుంటోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో పీలేరులో విస్తృతంగా పర్యటించి పార్టీ శ్రేణులను కలిసి కార్యకర్తలకు అండగా ఉంటానని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# నేటి నుంచి నవరాత్రులు



- విద్యుద్దీపకాంతులతో ఆలయాల ముస్తాబు
- తొమ్మిది రోజులు అలరించనున్న అలంకరణలు
- పీలేరు రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో....
- మదనపల్లెలో వాసవీ కన్యకాంబ, రాజ రాజేశ్వరీ దేవి ఆలయాల్లో వేడుకగా ఉత్సవాలు
- కోర్టులో గంగమ్మ, నీరుగట్టువారిపల్లెలో ప్రత్యేక అలంకరణలు



నవరాత్రి వేడుకలకు ముస్తాబైన కోర్టులో గంగమ్మ అమ్మవారు

వాల్మీకిపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలకు ఆలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సెప్టెంబరు 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. పట్టణంలోని నల్లవీరగంగా భవాని ఆలయం, బజారువీధిలోని వాసవీ కన్యకాపర మేశ్వరిదేవి ఆలయం, కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం, చింతపర్తిలోని వాసవీ అమ్మవారి ఆలయం, గొల్లపల్లెలోని అమ్మవారి దేవాలయాలు నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక అలంకరణలతో ముస్తాబు చేశారు. సోమవారం నుంచి పదిరోజులు ఆలయాల్లో అమ్మవార్లను ఒక్కో రోజు ఒక్కో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఆలయాల వద్ద నుంచి ప్రధాన రహదారి వరకూ విద్యు త్ దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

## పీలేరులో సర్వం సిద్ధం

పీలేరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రోత్సవాలకు అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పీలేరు గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో ఆలకమిటీ చైర్మన్ రామక్రిష్టారెడ్డి, ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. 22న సోమవారం బాలా త్రిపురసుందరీదేవి అలంకరణ, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయనీ దేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న శ్రీలలితా త్రిపురసుందరీదేవి, 28న మహాచండీ, 29న సరస్వతీ దేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసుర మర్ధిని, 2న రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు అమ్మవారు దర్శనం ఇస్తారు. అక్టోబరు 2వ తేదీన రాత్రి 7 గంటలకు ఉత్సవ మూర్తికి ఊంజల్ సేవ నిర్వహి స్తారు. రోజూ సాయంత్రం లలితాదేవి కుంకుమార్చన నిర్వహిస్తారు. పట్టణంలోని శివాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, గ్రామదేవత ఎల్లమ్మదేవి ఆలయంలోనూ దసరా ఉత్సవాలు నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

## విద్యుద్దీప కాంతులతో....

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ఆలయాల్లో నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమౌతాయి. ఆదివారం ఆలయాలను విద్యుత్ దీపాలతో, ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కోర్టులో గంగమ్మ ఆలయం, వాసవీభవన్ వీధిలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం, నీరుగట్టువారి పల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయం, కొండామరిపల్లె, దేవతానగర్‌లోని రాజరాజేశ్వరీదేవి, దేవళం వీధిలోని సోమేశ్వర స్వామి ఆలయాలు విద్యుద్దీప కాంతులీనుతోంది. కోర్టులో గంగమ్మ ఆలయంలో 22న పసుపు, 23న కుంకుమ, 24న స్వర్ణకవచ, 25న గంధం, 26న అర్ధనారీ శ్వరి, 27న కొబ్బరి, 28న శాకాంబరి, 29న సర స్వతి, 30న మహిషాసుర మర్ధిని, అక్టోబరు1న పుష్ప అలంకరణ, 2వ తేదీన గాజుల అంలకరణలో అమ్మవారు దర్శనం ఇస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో 22వ తేదీ నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తెలిపారు. 22న అర్ధనార్వీరి దేవి, 23న గాయి త్రీదేవి, 24న మీనాక్షిదేవి, 25న అన్నపూర్ణదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న వారాహి దేవి, 28న భువనేశ్వరీ దేవి, 29న సరస్వతిదేవి, 30న మహిషాసురమర్ధిని, అక్టోబరు 1న రాజరాజేశ్వరీ దేవి, 2న ధనలక్ష్మీదేవి, 3న డోలోత్సవం, తోటోత్సవం నిర్వహిస్తారు. నీరుగట్టువారిపల్లెలో 23న పసుపు, 24న కుంకుమ, 25న కనక దుర్గ, 26న వెండికవచం, 27న అన్నపూర్ణేశ్వరీ, 28న శాకాంబరి, 29న సరస్వతీ, 30న మహిషా సురమర్ధిని, అక్టోబరు 1న ధనలక్ష్మీ, 2న రాజరాజేశ్వరీ దేవి అలంకరణలతో దేవి దర్శనం ఇస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. దేవతా నగర్‌లో వెలసిన శ్రీరాజరా జేశ్వరీ దేవి ఆలయంలో దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా 22న బాలత్రిపుర సందరీ దేవి, 23న సంతాన లక్ష్మీ, 24న లలిత త్రిపుర సందరి, 25న గాయిత్రి దేవి, 26న మహాలక్ష్మీ దేవి, 27న మధుర మీనాక్షి, 28న అన్న పూర్ణే శ్వరి, 29న సరస్వతీ దేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు1న మహిషాసురమర్ధిని, 2న రాజరా జేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తు లకు దర్శనం ఇస్తారని ఆలయ ధర్మకర్త పతంజలి స్వామి తెలిపారు. ఆలయాల్లో ప్రతి రోజు ఉదయం అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు.

## సోమేశ్వరస్వామి ఆలయంలో...

కలికిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి అమ్మవారి శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకుడు పుల్లారెడ్డి, ప్రధాన అర్చకులు రామచంద్ర శాస్త్రి, శివకుమార్ శాస్త్రి తెలిపారు. శక్తిస్వరూపిణి అమ్మవారు మహిషాసురమర్ధని సమేత సప్తమాతృకల రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. బాహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండేశ్వరి రూపాల్లో అమ్మవారిని తీర్చిదిద్దనున్నారు. సప్త మాత్రికల ప్రతిమలను కర్నాటక రాష్ట్రం నుంచి తెప్పించారు. ఆలయ కల్యాణ మండపంలో రోజూ సాయంకాలం ఆరు గంటలకు మహిళలచే సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చనలు చేస్తున్నారు. దుర్గాష్టమి సందర్భంగా 30వ తేదీ ఉదయం మహాకాళీ-మహాలక్ష్మీ-మహాసరస్వతి ప్రీతిగా చండీ హోమాలు నిర్వహించనున్నారు. అక్టోబరు 3న శుక్రవారం ఏకాదశి సాయంకాలం సప్తమాతృకల గ్రామోత్సవం అనంతరం నిమజ్జనం చేయనున్నట్లు ఆయన వివరించారు. రోజూ సాయంకాలం జరిగే కుంకుమార్చనలకు మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాల కోసం రూ10 లక్షలతో ఆలయ ధ్వజ స్థంభానికి పంచలోహాల తాపడం పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



ప్రత్యేక అలంకరణలో పీలేరు గ్రామదేవత రౌద్రాల అంకాలమ్మ





విద్యుద్దీపకాంతులతో నల్లవీరగంగాభవాని దేవాలయం - లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయం (వాల్మీకిపురం) - నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయం

## వైభవంగా లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం

వాల్మీకిపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చాలా అరుదుగా వచ్చే పితాలయ అమావాస్య సందర్భంగా ఆదివారం ఆలయంలో పితృదేవత ప్రీతిగా పితృసూక్త హోమం తదితర పూజలు జరిగాయి. అనంతరం జగన్మంగళ గోముఖాదేవి సమేత లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం విశేషాలంకరణలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదానం చేపట్టారు. ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అన్నాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

## రంగమ్మ చెరువు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కురబలకోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంగళ్ళు సమీప రంగమ్మ చెరువు వద్ద రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఆదివారం ఏర్పాటు చేశారు. హంద్రీ-నీవా కాల్వ ద్వారా కృష్ణాజలాలను కుప్పం పట్టణానికి తరలించారు. ఇందులో భాగంగా తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీ-నీవా జలాలతో నింపాలని చర్యలు చేపట్టారు. చింతయ్యగారికోట సమీప కాల్వ నుంచి నీటిని రంగమ్మకు విడుదల చేశారు. దీంతో పాటు కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి మొరవ పోతోంది. ఈ నీరు సీటీఎం చెరువుకు చేరుతోంది. చెరువు నిండి మొరవపోవడంతో మొరవహరిజనవాడకు వెళ్లే దారిలో ఉండడంతో ఈ మార్గంలో ఎవరూ వెళ్లరాదని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కాధర్‌బాష, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

## వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మదనపల్లె, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి దసరా బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషను కలిసి నిర్వహకులు ఆహ్వానించారు. సోమవారం నుంచి వచ్చే నెల 2వతేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరవాలని టీడీపీ సీనీయర్ నేత విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్కే రామకృష్ణ, ఆలయ ఈఓ రమణ, అర్చకుడు ఆహ్వానం అందించారు.

## పకడ్బందీగా సర్వే నిర్వహించండి



మిట్టామాలపల్లిలో స్వమిత్వ సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీధర్‌రావు

పెద్దమండ్యం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన స్వమిత్వ ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పెద్దమండ్యం, దిగువపల్లి, మందలవారిపల్లి, వెలిగల్లు గ్రామాల్లో సర్వే జరిగింది. పెద్దమండ్యం పంచాయతీ మిట్టామాలపల్లిలో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ సర్వే అనంతరం గ్రామాల అభివృద్ధి సాధన జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికీ యజయాని హక్కులు లభిస్తాయన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇంజనీర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, సర్వేయర్లు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు కూడా సహకరించి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

## మిట్స్‌లో ఎన్‌పీటీఈఎల్‌కు విశేష స్పందన

కురబలకోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీలో నిర్వహించిన ఎన్‌పీటీటీఈఎల్ పరీక్షకు విశేష స్పందన దక్కినట్లు వీసీ యువరాజ్ పేర్కొన్నారు. ఎన్‌పీటీఈఎల్, చెన్నై ఐఐటీల సంయుక్త ఆధ్వర్యంలో స్వయం పేరుతో ఏడాదికి రెండుసార్లు ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించారు. కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన పరీక్షలకు 2875 మంది ధరఖాస్తు చేసుకోగా 2,835 మంది హాజరయ్యారు. పరీక్షల్లో ప్రతిభ చాటిన వారికి ఆన్‌లైన్ సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

## భూకబ్జాలపై ఎమ్మెల్యే ఫిర్యాదు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీకేపల్లె కాలనీలో భూ కబ్జాలకు సహకరిస్తున్న ఉద్యోగులను సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే బీకే పల్లె కాలనీ 2వ వార్డులో ప్రభుత్వ స్థలంలో ఆరు పునాదులు నిర్మించడాన్ని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు తాము ప్రభుత్వ స్థలాలను వెదుకుతుంటే, 2వ వార్డులో వైసీపీ నేతలు భూ కబ్జా చేసి పునాదులు నిర్మిస్తున్నారన్నారు. ఇక్కడ ఇంత అక్రమాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన వీఆర్‌ఓ, సచివాలయ అడ్మిన్, ఎనర్జి అసిస్టెంట్ కలిసి 300 దాకా అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు కేటాయించారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన వీఆర్‌ఓ ప్రవీణ్, సచివాలయ అడ్మిన్ అశోక్, ఎనర్జీ అసిస్టెంట్ శ్రీధర్‌ను సస్పెండ్ చేయాలని జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఎస్పీడీసీఎల్ ఈఈకి ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అనంతరం పట్టణంలోని చిత్తూరు బస్‌స్టాండు వద్ద రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. సీసీరోడ్ల నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా నాణ్యత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. కార్యక్రమంలో గంగారపు రామ్మూర్తినాయుడు, రాటకొండ శ్రీనివాసులు, రఘుపతి నాయుడు, డాన్స్ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష, కమిషనర్ ప్రమీల

## కొత్త రేషన్ కార్డులు పంపిణీ

ములకలచెరువు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సోంపల్లెలో ఆదివారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్ లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ వెంకటసిద్ధయ్య, నేతలు పాల రాము, మునిస్వామి, రాము, రామాంజులు, షఫీ, రఫీ, అమానుల్లా, రామచంద్ర, మాహబూబ్‌బాషా, ఫకృషా పాల్గొన్నారు.

### మల్లెల గ్రామంలో....

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లోని రేషన్ షాపుల్లో స్మార్ట్ రేషన్ కార్డులను కూటమి నేతలు పంపిణీ చేశారు. ఉప్పరవాండ్లపల్లెలోని షాపు నంబర్ 10లో డీలర్ మధురాణి షాపులో ఆదివారం పంపిణీ చేశారు. గ్రామంలో ఉన్న అన్ని షాపులకు స్మార్ట్ కార్డులను ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు.

# పరవళ్లు తొక్కుతున్న పెద్దేరు ప్రాజెక్టు

ఆయకట్టు రైతుల్లో ఆనందం ● జలహారతి ఇచ్చిన టీడీపీ నేత సీడ్ మల్లికార్జున నాయుడు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు ప్రాజెక్టుతో తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లోని ఆయకట్టు భూములు సస్యశ్యామలం అవుతాయని తంబళ్లపల్లె నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు అన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు పెద్దేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తుండడంతో పొంగి ప్రవహిస్తోంది. టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ప్రాజెక్టు చైర్మన్ కోటాల శివకుమార్ ఆధ్వర్యంలో టీడీపీ సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, సాగు నీటి సంఘం సభ్యులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. పరవళ్లు తొక్కుతున్న పెద్దేరు ప్రాజెక్టు జలాలకు పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. వారు మాట్లాడుతూ పరవళ్ల తొక్కుతున్న పెద్దేరు ప్రాజెక్టుకు జలహారతి ఇవ్వడం పూర్వ జన్మ సుకృతమన్నారు. తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల కల్పతరువైన పెద్దేరు ప్రాజెక్టు నిండడంతో దాదాపు 4,500 ఎకరాల ఆయకట్టు భూములు సస్యశ్యామలం కానున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే రైతు సంక్షేమమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పెద్దేరు ప్రాజెక్టు పరిధిలోని ప్రతి ఎకరా ఆయకట్టు భూమికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఇటీవల ప్రాజెక్టు ఆధునీకరణ, కాల్వల మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెద్దేరు ప్రాజెక్టు నిండడంతో ఆయ కట్టు రైతుల్లో సంతోషం వెల్లివిరిస్తోందన్నారు. ఇరిగేషన్ ఏఈ సతీష్, చైర్మన్ శివకుమార్, టీసీ మెంబర్లు తేజమూర్తి నాయుడు, గంగిరెడ్డి, శివనాగిరెడ్డి, చల్లపల్లె వేణురెడ్డి, శివయ్య, ఓబులేసు, రేపనబాబు, ఆయకట్టు రైతులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



జలహారతి ఇస్తున్న టీడీపీ సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, టీడీపీ నేతలు

## పహిల్వాన్ శ్రీరామి రెడ్డి మృతి

కలికిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మేడికుర్తి పంచాయతీ కొమ్మేపల్లె గ్రామానికి చెందిన ప్రముఖ మల్లయోధుడు సి.శ్రీరామి రెడ్డి (77) మృతి చెందారు. 1970 దశకంలో ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ మంచి వస్తాదు (పహిల్వాన్)గా పేరు గడించాడు. చివరికి ఆయన పహిల్వాన్ శ్రీరామి రెడ్డిగా సార్థకనామధేయుడయ్యారు. హైదరాబాదు కేంద్రంగా కుస్తీల్లో శిక్షణ పొంది రెజ్లర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. హైదారాబాదులో శిక్షణ పొందడంతో ఆయనకు పహిల్వాన్‌గా పేరు స్థిరపడింది. 1972లో మేడికుర్తి పంచాయతీ సర్పంచుగా ఎన్నికై 1978 వరకూ కొనసాగారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించడంతో ఆ పార్టీలో చేరి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1984లో మండల వ్యవస్థ ఆవిర్భావం నుంచి పదేళ్ళపాటు మండల స్థాయి టీడీపీ అధ్యక్షుడుగా పనిచేశారు. అప్పటి టీడీపీ నేతలతో విభేదాలు పొడసూపడంతో ఆయన క్రమేపీ రాజకీయాలకు దూరమయ్యారు. శనివారం రాత్రి గుండెపోటు కారణంగా హైదరాబాదులో చికిత్స పొందుతూ మరణించాడు. శ్రీరామి రెడ్డి భౌతికకాయాన్ని ఆదివారం స్వగ్రామం కొమ్మేపల్లెకు తరలించారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులున్నారు.

## చెయ్యేటి వద్ద ఓబిలి గ్రామ పెద్దలు కాపలా

పెనగలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని పింఛా ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరదనీరు చెయ్యేరులో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఓబిలి - టంగుటూరు గ్రామాల మధ్య ఉన్న మట్టిరోడ్డు వరదనీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. నందలూరు, పెనగలూరు మండలాల సరిహద్దు గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఓబిలి టీడీపీ ఇన్‌చార్జి ఎస్.అమీరుల్లా అధ్యక్షతన గ్రామ పెద్దలు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నీళ్లలో మనుషులు దిగకుండా కాపలా కాశారు.

## నాగారపమ్మకు పూజలు

సుండుపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈడిగపల్లె సమీపంలోని నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, ఆలయ సమీప మామిడి తోటల్లో అన్నదానం చేశారు.



## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం



మార్కెట్ కమిటి వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు

మదనపల్లె, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మదనల్లె మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంశెట్టి ఆంజనేయులును ఆదివారం తెలుగు యవత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు సన్మానించారు. వైస్ చైర్మన్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు గుండ్లపల్లి యేగేశ్వర్‌బాబు, రాంశెట్టి రత్నమయ్య, రమేష్, సత్యం, రెడ్ప్పి, గుండ్లపల్లి ప్రభాకర్, మంజు, ప్రసాద్, నాగరాజు, నరసింహులు, శంకర తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

● 100 మంది పేదలకు ఉచిత వైద్యం



చిట్టిబోయినపల్లెలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గుర్రంకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని వాల్మీకీపురం ఏఎంసీ వైస్‌చైర్మన్ నౌషాద్‌అలీ, టీడీపీ రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్ నాయుడు అన్నారు. చిట్టిబోయినపల్లెలో టీడీపీ నేత బాబాజాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే పార్టీ లక్ష్యమన్నారు. పేదల కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. గుర్రంకొండ పంచాయతీ పరిధిలో ప్రజల కోసం బాబాజాన్ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలను చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎండీ.జమీర్, విజయ్‌కుమార్, హరియాదవ్, రామచంద్ర, ఇర్షాద్, అహ్మద్, ఫారుక్, తబ్రల్, ఇస్మాయిల్, డాక్టర్లు గంగాధర్‌నాయుడు, ఎస్.కే.అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

ములకలచెరువు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎం రోడ్డులో తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ఆకాష్ హాస్పిటల్స్, విశ్వవాణి రాయలసీమ కోఆర్డినేటర్ నాగేంద్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు జయరాణి బృందం 350 మందికి చికిత్స అందించి మందులు ఉచితంగా అందజేశారు.

## కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

● ముగ్గురి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్ పోలీసులు

కడప క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్లూకోల్ట్ పోలీసుల సమయస్ఫూర్తి, వేగవంతమైన స్పందన ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న ముగ్గురిని కాపాడింది. రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాలనుకున్న మహిళ, ఆమె ఇద్దరు పిల్లలను సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి అప్పగించి శభాష్ పోలీసు అని మన్ననలు పొందారు. వివరాలిలా.. ఎర్రముక్కపల్లె సమీపంలో ఉంటున్న ఓ మహిళ కుటుంబ కలహాలతో ఆదివారం ఉదయం 11గంటల సమయంలో తన ఇద్దరు పిల్లలను తీసుకుని భాకరాపేట రైల్వేగేటు వద్ద నుంచి రైల్వేట్రాక్‌పై వెళుతుండగా విధుల్లో ఉన్న ట్రాక్‌మన్ కిశోర్ వెంటనే గుర్తించి 112కు సమాచారం చేరవేశారు. సమీపంలో గస్తీలో ఉన్న బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లు రమా కాంత్‌రెడ్డి, వి.శ్రీనివాసులు వెంటనే స్పందించారు. ట్రాక్‌పై వేగంగా వెళుతున్న మహిళ, ఇద్దరు పిల్లలను సురక్షితంగా కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ చేసి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఈ విషయమై కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

## మోటరు బైకును ఢీకొన్న ఐచర్ వాహనం.. వ్యక్తి మృతి


షేక్ రసూల్ మృతదేహం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మోటారు సైకిలును ఐచర్ వాహనం ఢీకొనడంతో షేక్ రసూల్ (45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ బీవీఎస్ మూర్తి వివరాల మేరకు.. శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్ కాలనీకి చెందిన రసూల్ తన కుమార్తెను పిలుచుకు వచ్చేందుకు వెళుతుండగా ఐచర్ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో రసూల్ బైకు నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య పర్వానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కడప క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప - క్రిష్ణాపురం రైల్వే స్టేషన్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తికి తెల్లని గడ్డం ఉందని, 42 నుంచి 45 ఏళ్ల ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

## ఆటో బోల్తా... తప్పిన ప్రమాదం



కమలాపురం రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని క్రాస్ రోడ్డు ఆర్చి వద్ద ఆటో బోల్తాపడ్డ సంఘటన చోటు చేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం కడప నుంచి వస్తున్న ఆటో కమలాపురం ఆర్చి వద్ద గుంతల్లో బోల్తాపడింది. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. అయితే చాల రోజుల నుంచి రోడ్డు మరమ్మత్తులకు నోచుకోలేదు. క్రాస్ రోడ్డు నుంచి కమలాపురం వచ్చే దారిలో ఆర్చి వద్ద పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షాలు కురవడంతో నీరు నిలిచి గుంతలు కనిపించడంలేదు. దీంతో టూవీలర్లు, పాదచారులు గుంతల్లో పడి గాయపడుతున్నారు. ఎన్నిసార్లు ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికితీసుకెళ్లినా స్పందన లేదు. త్వరలో టెండర్లు పిలుస్తాం, ప్యాచింగ్ వేస్తాం అని చెబుతున్నారే తప్ప పని మాత్రం చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గతుకుల రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## లారీ, మినీ గూడ్స్ ఆటో ఢీ.. డ్రైవర్‌కు గాయాలు


గాయపడిన ఆటో డ్రైవర్‌ను 108లో తరలిస్తున్న దృశ్యం

ముద్దనూరు సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని జమ్మలమడుగు బైపాస్ సమీపంలో ఆదివారం లారీ, మినీ గూడ్స్ ఆటో ఢీ కొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలు... ముద్దనూరు నాలుగు రోడ్ల వైపు నుంచి తాడిపత్రి వైపు పేయింట్ లోడుతో లారీ వెళుతుండగా.. జమ్మలమడుగు నుంచి బైపాస్ రోడ్డు వీదుగా తాడిపత్రి వైపు వస్తున్న మినీ గూడ్స్ ఆటో అదుపు తప్పి ఢీకొన్నాయి. దీంతో రెండు వాహనాల ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. జమ్మలమడుగు మండల కన్నెలూరుకు చెందిన మినీ గూడ్స్ ఆటో డ్రైవర్ రాజేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రెండు బైకులు ఢీ... ఒకరికి గాయాలు

పులివెందుల రూరల్, సెప్టెం బరు 21 (ఆంధ్రజ్యోతి): పులి వెందుల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రహీం అనే యువకుడికి రక్తగాయాల య్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రహీం పులివెందులలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని ట్రాఫిక్ సీఐ హాజీవల్లి పరిశీలించారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## బాలిక అదృశ్యం



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం శ్రీనివాసనగర్‌కు చెందిన మంగపట్నం వెంకట వాసవి (14) శనివారం రాత్రి ఇంటి నుంచి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని బాలిక తండ్రి శ్రీనివాసులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎద్దుల వెంకటసుబ్బమ్మ హైస్కూలులో వాసవి 9వ తరగతి చదువుతోంది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలిక ఆచూకీ లభించిన వారు త్రీటౌన్ సీఐ, ఎస్ఐ సెల్ ఫోన్ నెంబర్లు 9121100589, 9121100592 ఫోన్ చేసి తెలపాలన్నారు.

## పుష్పగిరి రుద్రపాదం వద్ద సామూహిక పిండ ప్రదానం


కొండపై శివుని పాదంకు ప్రత్యేక అలంకరణ, పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తున్న దృశ్యం

వల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాలయ అవమాస్య సందర్భంగా ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి రుద్రపాదం వద్ద ఆదివారం సామూహిక పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పితృదేవతలతో పాటు మరణించిన తమ బంధువులకు పిండ ప్రదానం చేశారు. ముందుగా పంచమ నదిలో పుణ్యస్నానాలా చరించి రుద్రపాదం వద్ద పిండ ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ పిండ ప్రదానం చేస్తే పితృదేవతలు శాంతించి దీవిస్తారనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. పిండ ప్రదాన కార్యక్రమం అనంతరం రుద్ర పాదానికి తగిలించి ఆ పిండాలను పంచమనదిలో కలిపారు. ఆలయ ఆలయ ధర్మకర్త డి.వెంకటసుబ్బారెడ్డి, ఈవో శ్రీనివాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

## ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం



పీఈటీస్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 21, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని ఏపీ పీఈటీస్ ఎస్ఏపీఈ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడు బొగ్గేటి శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కె.విక్టర్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక నగర శివారు ప్రాంత కెమిస్ట్రీ భవన్‌లో జిల్లా పీఈటీస్ ఎస్ఏపీఈ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశానంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఎంపిక కార్యక్రమానికి పరిశీలకులుగా అసోసియేషన్ ప్రతినిధులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రవికుమార్, వీరాంజనేయులు హాజరయ్యారు. దాదాపు 200 మంది వ్యాయామ ఉపాధ్యాయ ఉపాధ్యాయునీయుల సమక్షంలో జిల్లా నూతన అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ట్రెజరర్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆ మేరకు ట్రెజరర్‌గా పి.శివకృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, మాజీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం, రైతు సంఘం నేతలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డిలు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు.భారీవర్షాల వలన ప్రొద్దుటూరు మండల పరిధిలో రాజుపాళెం, పర్లపాడు ప్రాంతాల్లో వరి, పత్తి, కంది, పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కొన్ని ప్రాంతాల్లోభూములు కోతకు గురయ్యాయని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు రబీ సీజన్‌కు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను 90 శాతం సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనావేసి రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, రామాంజనేయులురెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్.. సామగ్రి దగ్ధం

సీకేదిన్నె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాడిగొట్ల క్రిష్ణాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కావడంతో నాగూర్ భార్గవ్‌రెడ్డి ఇంటిలోని ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోయాయి. ఇంటిలోని వాషింగ్‌మిషన్, ఫ్రిజ్, బీరువాలోని బట్టలు, దాదాపు రూ.3 లక్షలు విలువచేసే సామాన్లు, సర్టిఫికెట్లు కాలిపోయాయన్నారు. సమాచారం అగ్నిమాపక సిబ్బందికి అందించడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పివేసినట్లు స్థానికులు తెలిపారు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో పాముల కలకలం

జమ్మలమడుగు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం పాము కలకలం రేపింది. ఆస్పత్రి ఆవరణలోని మేల్ వార్డు నుంచి ఫిమేల్‌వార్డు అక్కడి నుంచి గేటు వద్దకు చేరింది. అప్పటికే కిటికీలో నుంచి పాము వస్తోందని అక్కడున్న రోగులు భయంతో పరుగు తీశారు. దీంతో ఆస్పత్రిలోని కొందరు సిబ్బంది చుట్టుముట్టారు. వెంటనే కిటికీలో నుంచి గేటు వద్దకు వచ్చిన పామును కట్టెతో కొట్టి చంపారు. దీంతో ఆందోళన చెందిన రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

## కులం పేరుతో దూషించారంటూ కేసు

చెన్నూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె హరిజనవాడకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తిని అదే పంచాయతీలోని శివశంకర్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించి దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శివశంకర్ అనే వ్యక్తికి, శ్రీనివాసులు మధ్య గత మూడేళ్లుగా డబ్బు విషయమై వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీనివాసులు శనివారం రాత్రి వ్యక్తిగత పనిమీద ఉప్పరపల్లె నుంచి చెన్నూరుకు వస్తుండగా దారిలో శివశంకర్ అతన్ని ఆపి కులం పేరుతో దూషిస్తూ రాళ్లతో దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## 10 మంది జూదరుల అరెస్టు

దువ్వూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దభాకరాపురం పొలాల్లో జూదం ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వీరి వద్ద రూ.66,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆదివారం ఆళ్లగడ్డ, దువ్వూరు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు రహస్య ప్రదేశాల్లో జూదం ఆడుతున్నట్లు తెలిసి దాడి చేసి, జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అలాగే చింతకుంటలో బజ్జీల కొట్టు నిర్వాహకుడు బెల్టు మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 14 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## 'పదోన్నతులు కల్పించకపోతే ఉద్యమిస్తాం'

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతుల్లో అన్యాయానికి గురైన 1207 మంది భాషా పండితులకు పదోన్నతులు కల్పించకుంటే ఉద్యమం చేపడుతామని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో భాషా పండితుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో భాషోపాధ్యాయుల పదోన్నతుల సమయంలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో 1207 మంది పండిట్లు పదోన్నతులు రాక అన్యాయానికి గురయ్యారని పేర్కొన్నారు. దీనిపై తాము ఆరు సంవత్సరాలుగా న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. తమ పోరాటంపై స్పందించిన హైకోర్టు పండిట్లకు పదోన్నతులు కల్పించాలని తీర్పునిచ్చిందన్నారు. కోర్టు తీర్పు మేరకు పదోన్నతులు కల్పించాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం

జమ్మలమడుగు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదలపాలిట ముఖ్యమంత్రి సహాయనిధి వరమని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలో వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సహాయనిధి అందడం సంతోషకరమన్నారు. 21మంది లబ్ధిదారులకు రూ.10,96,035 సంబంధించి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.

## సమస్యలకు ఆత్మహత్యలే పరిష్కారం కాదు

● ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు కౌన్సెలింగ్

వేంపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు ఎదురైనపుడు ఆత్మహత్యలే పరిష్కారం కాదని సైకాలజిస్ట్ డాక్టర్ ఎమిలిన్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ 14వ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం ఆత్మహత్యల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. డాక్టర్ ఎమిలిన్ మాట్లాడుతూ శారీరక సమస్యలు గుర్తించగలమని, మానసిక సమస్యలను త్వరగా గుర్తించలేమన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అధికారులు పాల్గొన్నారు.

## రాచమల్లు సుద్దులు వినే వారెవ్వరు లేరు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి


చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే రాచమల్లు సుద్దులు వినే వారె వ్వరూ లేరని, వారి ఉడత బెదిరింపులకు ఎవ్వరూ భయపడరని, ప్రజా సంబంధమైన కార్యకలాపాల్లో పాల్గొంటానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం సహా య నిధి చెక్కులను కొండారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావ సరాలు ఆలస్యం కాకూడదనే రూ.54లక్షల చెక్కులు పంపిణీ చేస్తున్నానన్నారు. అధికారం ఉందని తాను చెడ్డ పనులు చేస్తే విమర్శించాలన్నారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేకు చేదోడు వాదోడుగా పని చేస్తానన్నారు. ఎవ్వరి బెదిరింపులకు భయపడనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ టాప్ 2 శాస్త్రవేత్తల జాబితాలో యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్లు


వైస్‌చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు శంకర్, వీరాంజనేయరెడ్డి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడపకు యోగి వేమన యూనివర్సిటీకి గర్వకారణంగా ఇద్దరు ప్రొఫెసర్లు ప్రపంచంలోని టాప్ 2శాతం శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. యూనివర్సిటీలోని మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.వి.శంకర్, మైక్రోబయాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎల్.వీరాంజనేయరెడ్డిలు 2025 ఎడిషన్‌లో చోటు పొందారు. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన ఈ డేటాలో యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు కూడా టాప్ 2శాతం శాస్త్రవేత్తలలో ఉన్నారు. ఈ విజయంపై యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌లు శాస్త్రవేత్తలను అభినందిస్తూ వారి కృషి యూనివర్సిటీకి మరింత గౌరవాన్ని తెచ్చిందని తెలిపారు.

## కడప జంతుశాస్త్ర అధ్యాపకుడు నాగేంద్రకుమార్‌కు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగేంద్రకుమార్

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రేవా యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ వీరనాగేంద్రకుమార్ సమర్పించిన వివిధ రకాల క్యాన్సర్లకు చికిత్స చేయడంలో కర్క్యుమిన్, దాని నానో ఫార్ములేషన్ల సంభావ్యపాత్ర అనే పరిశోధక అంశానికి మొదటి బహుమతి లభించింది. ఈ అవార్డును యూనివర్సిటీ కేలటన్ మలేషియా మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాటో ఇబ్రహీం చె ఓమర్, ఫిలిప్పీన్స్ సాన్ బేడా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అలోయ్షియస్మా ఎ.మారనన్ అందజేశారు. సదస్సులో 9 దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## డాక్టర మునికుమారి పరిశోధనకు పేటెంట్


సర్టిఫికెట్‌ను అందిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వ విద్యా లయం జన్యుశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మునికుమారి, పరిశోధక విద్యార్థి షేక్ బాబుల్లాకు పేటెంట్ లభించింది. వీరు ప్రయోగాత్మకంగా మొక్కల ఎదుగుదలకు అవసరమైన సూక్ష్మ పోషక మిశ్రమాన్ని నానో కణాలు ఉపయోగించి కొత్త ఫార్ములా అభివృద్ధి చేసినందుకు ఇండియన్ పేటెంట్‌ను పొందారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, సహచర అధ్యాపకులు, స్కాలర్లు అభినందించారు.



# ఇంద్రకీలాద్రికి దసరా శోభ

**నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు**

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

## విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

### శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

## నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

# ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

## అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

## నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

## కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

## తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

## తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

## విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

# భవన నిర్మాణ పనుల్లో నత్తే నయం

- ఒక్క భవనం కూడా పూర్తికాని వైనం
- నిర్మాణ పనుల్లో నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు
- కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా...



పునాదుల దశలోనే ఆగిపోయిన మహమ్మద్‌నగర్ అంగన్వాడీ భవనం, శెట్టిపల్లె-2 అంగన్వాడీ భవనం పునాదులపై పిచ్చిమొక్కలు

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్ (ఐసీడీఎస్) శాఖ సొంత భవన నిర్మాణాలకు 2022లో వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద మంజూరు చేశారు. అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఒక్కొక్క భవనానికి రూ.13.20 లక్షల నిధులను కేటాయించారు. ప్రస్తుతం ఈ భవనాలు నిర్మాణ పనులను పరిశీలిస్తే నత్తే నయం అన్న చందంగా మారాయి. ఇప్పటి వరకు ఒక్క భవనం కూడా పూర్తికాకపోవడమే విశేషం. వివిధ దశల్లో భవన నిర్మాణ పనులు ఆగిపోయి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో అంగన్వాడీ భవనాల నిర్మాణంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని అభియోగాలు రావడంతో ప్రస్తుత ప్రభుత్వంలో కూడా వాటి పనులు సాగడం లేదు. వీటి పర్యవేక్షణ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అప్పగించారు. వీరు సంబంధిత కాంట్రాక్టర్లతో కలిసి భవన నిర్మాణానికి సామాగ్రి పేరుతో పనులు చేపట్టకుండా నిధులు మార్చుకున్నట్లు బాహాటంగానే చెబుతున్నారు. సామాగ్రి తోలిన చోట సిమెంటు, కడ్డీలు, ఇటుకలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇవి నిరుపయోగంగానే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. చాలా చోట్ల అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో ప్రైవేటు గృహాల్లో నిర్వహిస్తున్నారు. సంబేపల్లె మండలంలో 17 అంగన్వాడీ భవనాలు నాడు-నేడు కింద మంజూరయ్యాయి. 2022 నుంచి ఇప్పటి వరకు ఒక్క భవనం కూడా నిర్మాణ పనులు పూర్తి చేయలేదు.

### మండలంలో మంజూరైన కేంద్రాలు ఇవే...

2022లో వైసీపీ ప్రభుత్వం సంబేపల్లె మండలంలో అగ్రహారం, దేవళంపేట, బావులకాడపల్లి, ఎస్.సోమవరం, ఎగువనల్లగుట్టపల్లి, బట్టావాండ్లపల్లె, గుదియవాండ్లపల్లె, మహమ్మద్‌నగర్, డి.వడ్డెపల్లె, శెట్టిపల్లె-1, శెట్టిపల్లె-2, గాండ్లపల్లి, పెద్దబిడికి, అంకిరెడ్డిగారిపల్లె కేంద్రాలను మంజూరు చేశారు.

### వివిధ దశల్లో ఉన్న భవనాల నిర్మాణ పనులు

బొగ్గులవారిపల్లె, గాండ్లపల్లె, ఎగువ నల్లగుట్టపల్లి, బట్టావాండ్లపల్లె భవనాలు మౌల్డింగ్ దశలో ఉన్నాయి. దొడ్డిసిద్దయ్యగారిపల్లె, శెట్టిపల్లె-2, శెట్టిపల్లె-1, గుదియవాండ్లపల్లె, బావులకాడపల్లి, అగ్రహారం, దేవళంపేట, ఎస్.సోమవరం, మహమ్మద్‌నగర్, పెద్దబిడికి కేంద్రాలు పునాది దశలోనే నిలిపేశారు. నిధులు లేక కొన్ని కేంద్రాలు సిమెంటు, కడ్డీలు లేక మరికొన్ని భవనాలు ఇలా చాలాచోట్ల పనులు జరగలేదు. నిరుపయోగంగా ఉన్నాయి. భవనాల నిర్మాణం కోసం కేటాయించిన సామాగ్రి పనులు జరగకపోవడంతో దుర్వినియోగం అవుతున్నట్లు స్థానికులు తెలిపారు. బావులకాడపల్లి, గుదియవాండ్లపల్లె, దేవళంపేట కేంద్రాల భవన నిర్మాణ పనులు తక్కువ చేసి బిల్లులు ఎక్కువ చెల్లించినట్టు ఫిర్యాదులు వచ్చాయి. దేవపట్ల-1 అంకిరెడ్డిగారిపల్లె అంగన్వాడీ భవనాలు కట్టకుండానే సామాగ్రి పేరుతో బిల్లులు చెల్లించినట్లు చెబుతున్నారు. మహమ్మద్‌నగర్‌లో భవనంపై 11 కేవీ విద్యుత్ వైర్లు వెళుతున్నాయి. పునాది దశ వరకు వేసి నిలిపేశారు. మండలంలో మోడల్ స్కూల్‌కు వచ్చిన నిధులను కూడా అంగన్వాడీ భవనాల నిర్మాణాల కోసం నిధులు తరలించారు. పనులు తక్కువ చేసి ఎక్కువ బిల్లులు పొంది పనులు చేయకుండా వదిలేయడంతో పిల్లలకు వినియోగంలోకి రాలేదు. ఒక యూనిట్‌కు రూ.30 వేలు చొప్పున పనులను అప్పగించారు. కేంద్రాల పనులకు సంబంధించి సీపీయం కింద ప్రతి కేంద్రానికి కిటికీలు, డోర్లు, సిమెంటు, రంగులు, ఎలక్ట్రికల్ వర్క్ సామాగ్రి ప్రభుత్వం నుంచి సరఫరా చేశారు. కొంతమంది కాంట్రాక్టర్లు పనులు తక్కువ చేసి ఎక్కువ బిల్లులు తీసుకుని పనులు చేయకుండా వదిలేయడంతో నిధులు దుర్వినియోగం చేస్తారని ఆరోపిస్తున్నారు.

**కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా**

అంగన్వాడీ భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయి సామాగ్రి దుర్వినియోగం అవుతుంది. కూటమి ప్రభుత్వం ఆగిన భవనాల నిర్మాణాలను పరిశీలించి పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉంది. నిధులు దుర్వినియోగమైన చోట విచారణ చేపట్టి చర్యలు తీసుకుని భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

- జయనారాయణరెడ్డి, శెట్టిపల్లె

**పనులే జరగడం లేదు**



అంగన్వాడీ కేంద్రాల భవనాల పనులు జరగడం లేదు. కొన్నిచోట్ల నిధులు లేవు. కొన్నిచోట్ల సామాగ్రి సరఫరా చేయలేదు. సిమెంటు ఉంటే కడ్డీలు ఉండవు, కడ్డీలు ఉంటే సిమెంటు ఉండదు. ఇలా చాలా చోట్ల ఇచ్చిన సామాగ్రి దుర్వినియోగం అవుతోంది. భవన నిర్మాణానికి కావాల్సిన సామాగ్రి సరఫరా చేసి పూర్తి చేయాలి.

-శ్రీనివాసులు, ఎంఈఓ, సంబేపల్లె

## జీఎస్‌టీ తగ్గింపు ప్రధాని దసరా కానుక

పీలేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గింపు ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు దసరా కానుక అందించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.చంద్రశేఖరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 99 శాతం వస్తువులపై కేవలం 5 శాతం జీఎస్‌టీ విధింపు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని ఆయన గుర్తు చేశారు. జీఎస్‌టీ తగ్గింపు, ఉద్యోగులకు ఏడాది రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ద్వారా ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దేశప్రజలు అమితంగా లాభపడతారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో దీమా వ్యక్తం చేశారు.

## దాడిలో యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సర్టిఫికెట్లు ఇవ్వలేదని భార్యపై గొడవ పడుతున్న భర్తపై వరసకు అన్న దాడి చేసి కర్రతో కొట్టి గా యపర్చినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసులు కథనం మేరకు కొండామరిపల్లె గ్రామం, వెంకటప్ప కోట కాలనీ వాసి నాగరాజ కుమారు డు శరత్‌బాబుపై ఎనుములవారిపల్లెకు చెందిన డ్రైవర్ రాజు ఆదివారం కర్రతో దాడిచేసి గాయపర్చాడు. సర్టిఫికెట్ల విషయమై భార్య స్వాతి, భర్త శరత్‌బాబు ఘర్షణ పడ్డారు. తనకు అన్న వరస అయిన రాజుకు ఫోన్‌ద్వారా స్వాతి సమాచారం ఇవ్వడంతో వెంటనే ఇంటికి వచ్చి శరత్‌బాబుపై దాడి చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే గాయపడిన వ్యక్తిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంక టరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కలప రవాణాను అడ్డుకున్న అధికారులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో పట్టపగలే దర్జాగా కలప అక్రమ రవాణా చేస్తున్న వారిని ఎట్టకేలకు అటవీ అధికారులు అడ్డుకున్నా రు. అనుమతి లేకుండా కలప రవాణా శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథ నానికి ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు స్పందించారు. ఆదివారం ఉదయం ప్రభుత్వాస్పత్రి వద్దకు ఇన్‌చార్జి డీఆర్ఓ శివకుమార్ వెళ్లి పరిశీలించగా, అక్కడ చెట్లకు నరికి ట్రాక్టర్‌కు లోడ్ చేస్తుండగా వెళ్లి అడ్డుకున్నారు. శంకర్‌రెడ్డి అనే వ్యక్తి ఒక ప్రజాప్రతినిధి పేరు చెప్పి ఆయన అనుమతి ఇచ్చారని డీఆర్ఓను నమ్మించడానికి ప్రయత్నించారు. దీనిపై డీఆర్ఓ ఆరా తీయగా ప్రజాప్రతినిధి ఎవరికీ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో కలప ట్రాక్టర్‌ను అటవీశాఖ కార్యాలయానికి తరలించి ఎఫ్ఆర్ఓ జయప్రసాదరావు ట్రాక్టర్‌కు రూ.8,500 జరిమానా విధించారు.

## చిత్తడిగా టమోటా మార్కెట్

కలకడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే కలకడ- గుర్రంకొండ మార్గంలోని టమోటా మార్కెట్ చిత్తడిగా మారుతోంది. మండీల ముందు ప్రాంతం ఎత్తు పల్లాలుగా ఉంది. కారణంగా వర్షాలకు చేరుతున్న నీరు పారుదల లేక ఒకచోట నిలిచి బురదమయంగా మారుతోంది. ఇక్కడి నుంచి వివిధ మార్కెట్‌లకు టామోటాలను రవాణా చేసేందుకు వచ్చే వాహనాల చక్రాలు బురదలో చిక్కుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో ఒక్కోసారి రోడ్డుపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి రాక పోకలకు అటంకం కలుగుతున్నట్లు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



# చెలరేగిపోతున్న కేబుల్ వైర్ల దొంగలు...

- ఒక్కరోజే 400 మీటర్ల వైరు దొంగతనం

నిమ్మనపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేబుల్ వైర్ల దొంగలు రోజురోజుకూ చెలరేగిపోయి ఎక్కడ పడితే అక్కడ వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలిస్తు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఆదివారం నిమ్మనపల్లి పంచాయతిలోని ఊట్లవంక సమీపంలో వున్న వ్యవసాయ బోర్ల వద్ద 15మంది రైతులు ఏర్పాటు చేసిన 400వందల మీటర్ల కేబల్ వైర్లను దోచుకెళ్లారు. అలాగే వాల్మీకిపురం మండలంలోని దేవళంకురవపల్లెకు చెందిన శ్రీరా ములు, వెంకటరమణ, నాగరాజు, శ్రీనివాసులు అనే రైతుల వ్యవసాయ బోర్ల వద్ద 135మీటర్లు కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి అపహరించుకుపోయారు. అంతే కాకుండా గత 6నెలలగా తవళం, అగ్రహారం, ముష్టూరు, కొండయ్యగారిపల్లి, రాచవేటివారిపల్లి, సామకోటవారిపల్లి పంచాయతీల్లో దాదాపు 50మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు కత్తిరించుకు పోయారు.

అలాగే పంచాయతీలకు చెందిన తాగునీటి బోర్లను కూడా వదల లేదు, కొండయ్యగారిపల్లిలో ఏకంగా మోటారు ఎత్తుకెళ్లారు. అయితే దీనిపై సంభందిత రైతులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అగ్రనేతల సహకారంతో పీలేరులో జనసేన అభివృద్ధి

పీలేరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అధిష్టానం అండదండలతో నియోజవర్గంలో తమ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పీలేరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బెజవాడ దినేశ్ పేర్కొన్నారు. విజయవాడలో జరుగుతున్న తమ పార్టీ అంతర్గత వర్క్‌షాపులో పీలేరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై నివేదించినట్లు ఆయన తెలిపారు. పార్టీ అగ్ర నేత, ఎంఎల్‌సీ నాగేంద్రబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంఎల్‌సీ పిడుగు హరిప్రసాద్ పీలేరు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి శాయశక్తులా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జనసేనకు జనసైనికులే ఆరో ప్రాణం అని, పార్టీ సిద్ధాంతాలను వారి ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా వారు మార్గనిర్దేశం చేశారని, వారి మార్గదర్శకత్వంలో పార్టీ నూతన జవసత్వాలు కూడగట్టుకుంటోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో పీలేరులో విస్తృతంగా పర్యటించి పార్టీ శ్రేణులను కలిసి కార్యకర్తలకు అండగా ఉంటానని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.